## జిల్లా అడిషనల్ డిసిపి అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించిన కుశల్కర్


సిపిని కలిసి పూలబోకేను అందజేస్తున్న అడిషనల్ డిసిపి అడ్మిన్ కుశల్కర్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:** జిల్లా అడిషనల్ డిసిపి అడ్మిన్‌గా సి.హెచ్. కుశల్కర్ సోమవారం సీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సీపీ అనురాధను కలిసి పూలబొకేను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె కుశల్కర్‌ను అభినందించారు. అనంతరం ఏవో యాదమ్మ, ఎసిపిలు నరసింహులు, రవీందర్‌రెడ్డి, సిఐలు కిరణ్, మొగిలి, శ్రీధర్‌గౌడ్, వాసుదేవరావు, విద్యాసాగర్, ఉపేందర్, శ్రీను, కార్యాలయం సిబ్బంది నూతన అడిషనల్ డిసిపి అడ్మిన్‌గా బాధ్యతలు స్వీకరించిన సి.హెచ్.కుశల్కర్‌ను కలిసి పూల మొక్కలను అందించారు.




మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త


## మత సామరస్యంతో పండుగలు నిర్వహించుకోవాలి

### ఎసిపి రవీందర్‌రెడ్డి

**సిద్దిపేట రూరల్, ఆగస్టు 25,ప్రభాతవార్త :** భిన్నత్వంలో ఏకత్వంలో అందరూ కలిసి పండులు నిర్వహించుకోవాలని ఎసిపి రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్జీవో భవన్‌లో సోమవారం వినాయక చవిత, మిలాద్ ఉన్ నబీ పండుగల సందర్భంగా హిందూ, ముస్లింల పెద్దలతో నిర్వహించిన శాంతి కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.

సోషల్ మీడియాలో వచ్చే పుకార్లు నమ్మవొద్దన్నారు. మత సామరస్యంతో పండుగలు నిర్వహించుకోవాలన్నారు. అన్ని మసీదులలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఏదైనా సంఘటన జరిగితే వెంటనే స్థానిక పోలీసుస్టేషన్‌లో తెలియజేయాలన్నారు. అన్ని మతాలను,కులాలను గౌరవించుకుంటూ సమాజంలో ముందుకు వెళ్లడం చాలా ముఖ్యమని తెలిపారు. కార్యక్రమంలో సీఐలు విద్యాసాగర్‌రావు, వాసుదేవరావు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.


సంక్షేమ వసతి గృహాన్ని సందర్శించిన కలెక్టర్

## విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 25, ప్రభాతవార్త :** సోమవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిబా(బాలుర) సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న భోజన నాణ్యతను పరిశీలించి, వంటశాల, వంట సామగ్రి పరిశుభ్రతను తనిఖీ చేశారు. అలాగే విద్యార్థుల హాజరు, చదువు పురోగతి, అధ్యాపకుల హాజరు రిజిస్టర్లు, వసతి గృహ పరిసరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాలలో విద్యార్థులకు ప్రభుత్వం సకల సదుపాయాలు కల్పించిందని, నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఆహారం,శుద్ధమైన తాగునీటిని అందించాలని చెప్పారు. విద్యార్థులకు రాత్రి భోజనంలో అందించిన ఆహార పదార్థాలు మెనూకు అనుగుణంగా ఉన్నాయా అని పరిశీలించారు. భోజనం సక్రమంగా అందిస్తున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వర్షాల నేపథ్యంలో దోమల వలన వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతి గృహ పరిసరాలలో నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వసతి గృహాలలో అందుబాటులో ఉన్న తాగునీరు, టాయిలెట్స్ తదితర సదుపాయాలు పరిశీలించారు. వంటగది, స్టోర్ రూమ్, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపారు. విద్యార్థులకు ఇబ్బందులు తలెతకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ధనరాజ్, ఉపాధ్యాయులు ,సంబంధిత అధికారులు ,తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించిన ఎస్పి


ప్రజావాణిలో పాల్గొన్న ఎస్పి పరితోష్ పంకజ్

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 25,ప్రభాతవార్త:** పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యాక్రమానికి హాజరై ఫిర్యాదుదారుల సమస్యలను జిల్లా ఎస్పి పరితోష్ పంకజ్ విన్నారు. ప్రజలు అందచేసిన ఫిర్యాదులను ఎస్పి స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను విని సంబంధిత పోలీసు ఠాణా స్టేషన్ అధికారితో ఫోన్‌లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. చట్టాన్ని అమలు చేయాలని, చట్టం ఎవరికి చుట్టం కాదని గుర్తు చేశారు. జిల్లా ప్రజలు తమ సమస్యలకు స్థానికంగా పరిష్కారం అందకుంటే మూడవ వ్యక్తి ప్రమేయం లేకుండా, పైరవీలకు తావు లేకుండా జిల్లా పోలీసు కార్యాలయ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## అయ్యా రోడ్లు బాగు చేయండి..

### సబ్ కలెక్టర్ ఉమాహారతికి బిజెపి వినతి

**నారాయణఖేడ్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** పట్టణంలో అధ్వానంగా ఉన్నాయని మరమ్మతులు చేయించాలని బిజెపి ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ ఉమాహారతికి వినతిపత్రం అందించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని తెలిపారు. అనంతరం బీజేపీ ఆధ్వర్యంలో ఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రామకృష్ణ, కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ నియోజకవర్గం మొత్తం రోడ్లు అధ్వానంగా మారాయని, వాటిని మరమ్మతులు చేయాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు కూడా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయలేదని మండిపడ్డారు. వారిని గద్దె దించే దాకా బుద్ధి రాదని పేర్కొన్నారు.

### మత్తుపదార్థాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ

## భాగస్వాములు కావాలి: ఎసిపి రవీందర్‌రెడ్డి

**బెజ్జంకి, ఆగస్టు 25, ప్రభాతవార్త :** క్రీడలతో క్రమశిక్షణ మెరుగుపడుతుందని సిద్దిపేట ఎసిపి రవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పోలీసుశాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ తీసుకొవద్దు..డ్రగ్స్‌కు దూరంగా ఉండాలనే అనే నినాదంతో యువతకు అవగాహన కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి క్రీడాకారులతో మత్తుపదార్థాల నిర్మూలన లక్ష్యంగా ముందుకు నడవాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కువగా గ్రామాల్లో యువతలో చాలా మంది మత్తు, మద్యం, చెడు అలవాట్లకు బానిసై బంగారు భవిష్యత్‌ను నాశనంచేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలను అదపు చేయడంలో పోలీసులతో పాటు గ్రామస్తుల, యువత పాత్ర చాలా ముఖ్యమన్నారు. మత్తు పదార్థాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా భాగస్వాములు కావాలన్నారు. ఎవరైనా మత్తు పదార్థాలకు బానిసైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మత్తుకు అలవాటు పడినవారికోసం చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రిలో ప్రత్యేక విభాగం అందుబాటులో ఉందన్నారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్, వాలీబాల్, ముగ్గుల పోటీల్లో ప్రతిభ కనబరిచిన జట్టుకు జిల్లా కేంద్రంలో చోటు లభిస్తుందన్నారు. ప్రతి జట్టు ఉత్తమ ప్రతభ కనబర్చాలన్నారు. క్రీడా పోటీలు ఏర్పాటు చేసిన ఎస్ఐ బోయిని సౌజన్యను ఎసిపి అభినందించారు.


క్రీడాకారులతో కలిసి ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎసిపి రవీందర్‌రెడ్డి

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కృషి

*** వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ * 161 బొడ్మట్‌పల్లి హైవేపై అండర్‌పాస్ బ్రిడ్జ్ నిర్మాణానికి స్థల పరిశీలన**


బొడ్మట్‌పల్లి వద్ద అండర్ పాస్ బ్రిడ్జి కోసం స్థల పరిశీలన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

**టేక్మాల్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేస్తున్నట్లు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఈ మేరకు 161 నేషనల్ హైవేపై రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారని, అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఫ్లైఓవర్లు నిర్మించాలని పలుమార్లు నేషనల్ హైవే అథారిటీ అధికారులకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచించారు. ఈ నేపథ్యంలో అండర్ పాసుల, ఫ్లైఓవర్ల నిర్మాణానికి నేషనల్ హైవే ఆథారిటి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. సోమవారం టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి వద్ద అండర్ పాసులు, ఫ్లైఓవర్లు ఎక్కడెక్కడ నిర్మించాలో నిర్ణయించడానికి ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్ (టెక్నికల్) బోడ దేవిలాల్, ఎన్‌హెచ్‌ఏఐ మేనేజర్(ఓఎం) మహేశ్, సైట్ ఇంజనీర్ కిరణ్ పరిశీలన చేశారు. యాక్సిడెంట్లు జరుగుతున్న ప్రాంతాలను స్వయంగా చూపించి, ఆయా ప్రాంతాల్లో అండర్‌పాసులు, ఫైఓవర్ల నిర్మాణ ఆవశ్యకతను అధికారులకు మంత్రి వివరించారు. అందోల్ నియోజకవర్గంలోని శివ్వంపేట, తాడ్‌దాన్ పల్లి, అల్మాయ్‌పేట్‌చౌరస్తా, బొడ్మట్‌పల్లివద్ద యాక్సిడెంట్ స్పాట్లను అధికారులకు చూపించారు. మంత్రి ఎన్‌హెచ్ అధికారులను కూర్చోబెట్టుకుని స్వయంగా కారు నడుపుతూ సూచనలు చేశారు. ఇందులో తహసీల్దార్ తులసిరాం, ఎంపిడిఓ రియాజొద్దీన్, మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్, జోగిపేట సిఐ అనిల్ కుమార్, అల్లాదుర్గం సిఐ రేణుకరెడ్డి,ఎస్ఐ రాజేష్, ఇరిగేషన్ ఈఈ రవీంద్రకిషన్, మార్కెట్ కమిటీ చైర్మెన్ జగన్ మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నిమ్మ రమేష్, నాయకులు మాల్లారెడ్డి, సత్యనారాయణ, వినోద్, మజర్,మాన్‌కిషన్, చంద్రశేఖర్ రెడ్డి, సంగమేశ్వర్ రెడ్డి, కిశోర్, భూంరెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, అవినాష్, పాపయ్య, భూషణం, ధనంజయ, మాణయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి


ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించి శనివారంలోగా వివరాలను అందించాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె.హైమావతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన అనంతరం ఆమె మాట్లాడారు. ప్రజావాణిలో ప్రజల నుంచి 281 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రజావాణి కార్యక్రమంపై ప్రజలకు ఎంతో విశ్వాసం ఉందని అందుకు తగ్గట్టు వివిధశాఖలకు అందిన దరఖాస్తులను అధికారుల పరిశీలించి త్వరగా పరిష్కరించాలన్నారు. అనంతరం పోస్టాఫీస్ ద్వారా ముఖ గుర్తింపు పద్ధతి ద్వారా పింఛన్ల పంపిణీ కోసం ఉపయోగించేందుకు డిఆర్‌డిఎ ద్వారా స్మార్ట్ ఫోన్లను జిల్లాలోని బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్లుకు కలెక్టర్ అందించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డిఆర్వో నాగరాజమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**30లోగా లక్ష్యం ప్రకారం మొక్కలు నాటి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలి...**

జిల్లాలో ఆయాశాఖల వారీగా ఇచ్చిన లక్ష్యం ప్రకారం ఈనెల 30వ తేదీలోగా వనమహోత్సవ కార్యక్రమం ద్వారా మొక్కలునాటి జియో ట్యాగింగ్ పూర్తి చేయాలని కలెక్టర్ హైమావతి ఆదేశించారు. వన మహోత్సవ కార్యక్రమానికి సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకొని త్వరగా పూర్తి చేయించాలని జిల్లా అటవీశాఖ అధికారిని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు ప్రతి మంగళవారం, శుక్రవారం డ్రై డే కార్యక్రమాల్లో పాల్గొని పల్లెలలో పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించి ఉదయం 7 గంటలకే క్షేత్రస్థాయిలో ఉండాలన్నారు. పంచాయతీ సిబ్బంది తోపాటు గ్రామీణాభివృద్ధి వైద్య ఆరగ్యో, అంగన్‌వాడీ తదితర అన్ని శాఖల సిబ్బంది తప్పకుండా డ్రై డే కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. డయేరియా, డెంగ్యూ కేసులు నమోదైతే తెలియజేసి వెంటనే తగు వైద్య సేవలందించాలని అవసరమైతే ఫీవర్ సర్వే చేయాలని ఆదేశించారు.


కొండపాక పిఏసిఎస్ వద్ద యూరియా కోసం బారులు తీరిన రైతులు

## యూరియా కోసం బారులుతీరిన రైతులు

**కొండపాక, ఆగస్టు 25, ప్రభాతవార్త :** కొన్ని రోజుల నుండి యూరియా సరఫరా లేకపోవడంతో రైతులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో సోమవారం కుకునూరుపల్లి, కొండపాక మండలాలకు కొద్దిపాటిగా యూరియా రావడంతో తీసుకెళ్లడానికి రైతులు తెల్లవారేసరికి కొండపాకలో పిఏసిఎస్ ముందు, కుకునూరుపల్లిలో అగ్రోస్ ముందు భారీగా బారులు తీరారు. ఎండను సైతం లెక్కచేయకుండా రైతులు యూరియా కోసం క్యూలో నిలబడి కొంత మంది అలసిపోయారు. రైతులు ఎండను తట్టుకోలేక దాహం దాహం అంటున్నా ఎవరూ పట్టించుకున్న పాపానపోలేదు. అధికారులు తాగు నీటి సౌకర్యం కల్పించకపోవడంపట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ యూరియా కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుండడంతో ప్రభుత్వంపై తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారు.

'వార్త ప్రభావం'

## పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదు చేస్తా..

### టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచందర్‌గౌడ్

**రామాయంపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ఫ్లెక్సీలో తన ఫోటో ముద్రించి తర్వాత తొలగించిన విషయమై కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానానికి ఫిర్యాదుచేస్తానని టిపిసిసి రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్ర గౌడ్ తెలిపారు. ఆదివారం 'వార్త' దినపత్రికలో 'రామాయంపేటలో కాంగ్రెస్ పెక్సీల రగడ.. ఫ్లెక్సీలపై రాష్ట్ర నాయకుడి ఫొటో వేసి రంగు పూసిన వైనం... కాంగ్రెస్‌లో బయటపడిన వర్గపోరు'..శీర్షికతో వచ్చినవార్తకు స్పందన లభించింది. కాంగ్రెస్ ప్రోటోకాల్ ప్రకారం కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే తర్వాత నాదే మెదక్ నియోజకవర్గంలో ఫోటో ఉండాలని రామ్‌చందర్‌గౌడ్ తెలిపారు. అయితే కొంత మంది (నారద మహామునులు, వాలీలు) ఆనాడు పురాణంలో ఉన్నట్టు ఈరోజు ఉన్నారనీ, వాటిని కార్యక్రమాలు చేస్తున్నారన్నారు.

బ్రతుకు తెరువుకోసానికి పార్టీని బదనాం చేయడానికి కొంతమంది బతుకుతున్నారనీ, వారి గురించి పార్టీలో ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఈ రోజు వరకు నేను పార్టీకి సేవ చేయడమే కానీ ఎలాంటి నామినేటెడ్ పోస్ట్ తీసుకోలేదన్నారు. అలాగే ఎలాంటి కాంట్రాక్టు తీసుకోలేదనీ, కాంట్రాక్టర్‌ను కూడా కాదని, కొంతమంది పార్టీ పేరు చెప్పి బతికే వాళ్ల గురించి పార్టీకి కంప్లైంట్ చేయడం జరుగుతుందనీ, అది ఎవరైనా సరేనని పల్లె రామ్ చందర్ గౌడ్ తెలిపారు.

# చేర్యాలను వెంటనే రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలి

### జెఏసి నాయకుల డిమాండ్


చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం రాజీవ్ రహదారిపై ధర్నా చేస్తున్న జెఏసి నాయకులు, ప్రజలు

**కొండపాక, ఆగస్టు 25, ప్రభాతవార్త :** చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించకుంటే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెపుతామని రెవెన్యూ డివిజన్ సాధన జెఏసి చైర్మన్ వకుళాభరణం నరసయ్య, సిపిఎం జిల్లా కార్యదర్శి అముదాల మల్లారెడ్డి, బిఆర్ఎస్ నేత ముస్త్యాల బాల్ నర్సయ్య, బిజెపినాయకుడు బూరుగు సురేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వెలికట్ట క్రాస్ రోడ్డు వద్ద చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జెఏసి ఆధ్వర్యంలో చేపట్టిన రాజీవ్ రహదారి ముట్టడి విజయవంతమైంది.ఎన్నికలకు ముందు అప్పటి పిసిసి అధ్యక్షుడు, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వెంటనే రెవెన్యూ డివిజన్ ప్రకటించాలన్నారు. అధికారిక పనుల కోసం హుస్నాబాద్, గజ్వేల్, సిద్దిపేట, జనగామ, భువనగిరి జిల్లాలకు వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకోవాలన్నారు. స్వయంగా ముఖ్యమంత్రే రెవెన్యూ డివిజన్ చేస్తానని చెప్పి మరిచిపోవడం విడ్డూరంగా ఉందన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి మాట తప్పితే ఒక్క వార్డు సభ్యుడినీ గెలవకుండా జెఏసి ఆధ్వర్యంలో కృషి చేస్తామని ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. గతంలో చేర్యాల నియోజకవర్గంగా, తాలుకాగా, సమితిగా కొనసాగిన చేర్యాల నేడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. చేర్యాల ప్రాంతం నాటి తెలంగాణ రైతంగా సాయుధ పోరాటం నుండి నేటి అనేక ఉద్యమాల వరకు కీలక భూమిక పోషించిన చారిత్రకప్రాంతంగా చరిత్రలో నిలిచిపోయిందన్నారు. చేర్యాలను ప్రాంతాన్ని నిర్వర్యం చేసే విధంగా ప్రభుత్వం కాలాయాపన చేస్తుందన్నారు. చేర్యాల అభివృద్ధి చెందాలంటే రెవెన్యూ డివిజన్ చేయడం ఒకటే మార్గమన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం ఎన్నికలకు ముందే రెవెన్యూ డివిజన్ ప్రకటించి తన చిత్తశుద్దిని నిరూపించుకోవాలని కోరారు. రెవెన్యూ డివిజన్ సాధించేవరకు జెఏసి అధ్వర్యంలో ఉద్యమన్ని మరింత ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లేషం సత్తిరెడ్డి, తిరుపతిరెడ్డి, వెంకట్ మావో, శ్రీధర్‌రెడ్డి, యాదగిరి. సాందు, సంతోష్, రవీందర్, పద్మ, శోభ, మానస, శశిధర్, వెంకట్ రెడ్డి, బాల్‌రెడ్డితోపాటు చేర్యాల టౌన్, చేర్యాల రూరల్, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట మండలాల నుండి బారీగా ప్రజలు తరలివచ్చారు. రాజీవ్ రహదారి ముట్టడితో రాకపోకలకు అంతరాయం కలగడంతో కుకునూరుపల్లి పోలీసులు అక్కడకు చేరుకొని అందోళనకారులతో మాట్లాడి రాస్తారోకోను విరమింప చేశారు.


మాట్లాడుతున్న మాదాసు శ్రీనివాస్

## ఎరువుల కోసం రైతుల పడిగాపులు

### నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్న ప్రభుత్వం

### -ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో రైతంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టిలేదని, ఎరువులు, యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తుంటే నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని గజ్వేల్ వ్యవసాయ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆరోపించారు. సోమవారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పదేళ్ల పాలనలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రథమ స్థాయికి ఎదిగిన రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం రెండేళ్ల పాలనలో పతనం అంచుకు తీసుకువచ్చిందని విమర్శించారు. రాష్ట్రం ఏర్పడిన తర్వాత అధికారంలోకి వచ్చిన వెంటనే కెసిఆర్ రైతులకు, వ్యవసాయ రంగానికి వెన్నుదన్నుగా నిలిచారన్నారు. పంటపొలాలకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను, కల్తీలేని విత్తనాలు, ఎరువులను సకాలంలో అందించినట్లు తెలిపారు. అలాగే ప్రాజెక్టుల నిర్మాణంతో రైతులకు సాగునీరు, రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు సురక్షితమైన మంచినీటిని అందజేసిన ఘనత కెసిఆర్‌దే అన్నారు. సాగునీరు అందించడంవల్ల రాష్ట్రంలో సాగు విస్తీర్ణం పెరిగి వరి సాగులో దేశంలోనే ప్రథమ స్థానానికి తెలంగాణ ఎదిగిందన్నారు. కెసిఆర్ ముందుచూపుతో ఎరువులు అందజేయడంలో, పంట కొనుగోలు చేయడంలో రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్రామస్థాయిలోనే కల్పించారన్నారు. మార్పు పేరుతో ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో రైతులు, ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారని, కెసిఆర్ హయాంలో కడుపునిండా తిని కంటినిండా నిద్రపోయిన రైతులు నేడు అర్ధరాత్రి కరెంటు కోసం, ఎరువుల కోసం కాపలా కాసే పరిస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చర్యల వల్ల గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా దెబ్బతిన్నదని, గ్రామాల్లో తిరిగి ఆర్థిక సంక్షోభం రావడానికి రేవంత్ ప్రభుత్వ మూర్ఖపు చర్యలే కారణమని అన్నారు. బడేబాయ్ చోటేబాయ్ బంధాన్ని సుస్థిరం చేస్తానని మాట్లాడిన రేవంత్‌రెడ్డి ఎందుకు యూరియా విషయంలో కేంద్ర ప్రభుత్వంతో సరైన సంప్రదింపులు జరపడంలేదని, ఎందుకు తగినంత యూరియా తీసుకురావడంలేదో అర్థం కావడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, నాయకులు శివకుమార్, ఉమర్, నిజామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## కారు బైక్ ఢీ.. ఒకరు మృతి

**కౌడిపల్లి, ఆగస్టు 25,ప్రభాతవార్త:** ఆజాగ్రత్తగా, అతివేగంగా కారును నడుపుతున్న డ్రైవర్ ముందుగా వెళుతున్న బైక్‌ను ఢీకొని ఒకరు మృతి చెందినట్లు సంఘటన సోమవారం కౌడిపల్లిలోని శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయం సమీపంలో జరిగనట్లు ఎస్సై రంజిత్‌రెడ్డి తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... సోమవారం మధ్యహ్నాం మెదక్ జిల్లా హవేలీ ఘనపూర్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన గుండా సరేష్(30) ప్రతి రోజు హైదరాబాద్‌లో లాఎంక్లిన్ ఇండియా కంపెనీలో సూపర్‌వైజర్‌గా పని చేయడానికి హీరోబైక్(టిఎస్-డి-8314)పై వెళ్లి తిరిగి గ్రామానికి వస్తుండగా నర్సాపూర్ నుంచి మెదక్ వెళ్లే మారుతి నెక్సాఎక్స్‌ఎల్6 కారు (టిఎస్-08-కెబి 6770) డ్రైవర్ అతివేగంగా, ఆజాగ్రత్తగా నడుపుతూ ముందుగా వెళుతున్న బైక్‌ను ఢీకొట్టడంతో నరేష్‌కు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి ఆయన తెలిపారు. విషయం తెలిసిన వెంటనే ఘటన స్థలానికి వెళ్లి కారు డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని, మృత దేహాని పోస్టుమార్టం నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించి నట్లు ఆయన చెప్పారు. మృతునికి హవేళిఘనపూర్ గ్రామానికి చెందిన ప్రవళికతో నాలుగు నెలల క్రితమే వివాహం జరిగిందని, తండ్రి లేడు, తల్లి మాత్రమే ఉన్నట్లు తెలిసింది. మృతుడి భార్య ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రంజిత్ కుమార్ రెడ్డి తెలిపారు.

## చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

**సంగారెడ్డి టౌన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** వృద్ధురాలిని బెదిరించి మెడలోని పుస్తెలతాడును దోచుకెళ్లిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు పేర్కొన్నారు. పోలీసుల కథనం ప్రకారం... పట్టణంలోని ఎడిఎఫ్ కాలనీలో ద్వారకానగర్‌లో నివాసం ఉంటున్న హంసమ్మ (62) ఈ నెల 24న ఉదయం 6 గంటల ప్రాంతంలో ఇంటి ముందు వాకిలిని ఊడుస్తుండగా కొండాపూర్ గ్రామానికి చెందిన డిసిఎం డ్రైవర్ కౌంకుట్ల ప్రభాకర్(36) హంసమ్మను బెదిరించి మెడలోని 5 తులాల బంగారు పుస్తెలతాడును దోచుకుని వెళ్లిపోయాడన్నారు. బాధితుల ఫిర్యాదే మేరకు కేసు నమోదు చేసి నాలుగు బృందాలుగా ఏర్పడి సిసి కెమెరాల ఆధారంగా నేరస్తుడు ఉపయోగించిన బైక్ ఆధారంగా వసంత్ నగర్ కాలనీలో కిరాయికి నివాసం ఉంటున్న కౌకుంట్ల ప్రభాకర్‌ను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారించగా దొంగతనం చేసింది తానేనని ఒప్పుకున్నాడన్నారు. నిందితుడి నుంచి 5 తులాల పుస్తెల తాడును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు వివరించారు.

## ప్రమాదవశాత్తు పూరిగుడిసె దగ్ధం

**మెదక్ టౌన్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ప్రమాదవశాత్తు పూరి గుడిసె కాలిపోయిన సంఘటన మెదక్ మండలం మాచవరం గ్రామంలో చోటు చేసుకుంది. విషయాన్ని తెలుసుకున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు వల్దాస్ రాధా మల్లేష్‌గౌడ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ఇంట్లో ఉన్న వస్తువులు అన్ని కాలిపోయాయని, బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండో విడతలో ఇందిరమ్మ ఇళ్లు వస్తుందని, 12 గుంటల పొలాన్ని అమ్ముకొని ఆ డబ్బులు గుడిసెలోనే కాలిపోవడం జరిగిందనీ బాధితులు వివరించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్‌గౌడ్ బాధిత కుటుంబానికి నిత్యావసర వస్తువుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం స్పందించి బాధిత కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు వచ్చేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షురాలు బెండ వీణ, మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌గౌడ్, బిజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ సాయికుమార్, బూత్ అధ్యక్షులు మంగలి గోపాల్, సత్య నారాయణ, మండల నాయకులు రాకేష్, రవి, సిద్దు అజయ్, వినయ్, రవి, సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.


దగ్ధమైన పూరిగుడిసె దృశ్యం

## మండపాలకు తరులుతున్న గణనాథులు..

**చిలిపిచెడ్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
చిలిపిచెడ్ మండలంలో పలుగ్రామాలలో వినాయకచవితి పురస్కరించు కొని ఆయాగ్రామాల్లోని మండపాల నిర్వాహకులు మండపాలలో నెలకొ ల్పేందుకు పట్టణాల నుండి గ్రామాలకు గణనాయకులను తరలిస్తున్నారు. మండపాల నిర్వాహకులు గణనాయకులను నేటి నుండే పట్టణాల నుండి గ్రామాలకు ట్రాక్టర్లు, డిసిఎంల ద్వారా తరలిస్తున్నారు.

## కార్మికులకు కనీసవేతనం ఇవ్వాలి

**-సిఐటియు ఆధ్వర్యంలో రానె కంపెనీ ముందు ఆందోళన**

**సదాశివపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
సదాశివపేట పారిశ్రామిక ప్రాంతంలో ఉన్న రానె పరిశ్రమలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని, కార్మికులందరికీ గుర్తింపుకార్డులు ఈఎస్ఐ, పిఎఫ్, బోనస్, ఉచిత క్యాంటీన్ డ్రెస్ సౌకర్యాలు కల్పించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ప్రవీణ్‌కుమార్ కంపెనీ యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈరోజు సిఐటియు ఆధ్వర్యంలో కంపెనీ కార్మికులతో కలిసి కంపెనీ గేటు ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో సిఐటియు నాయకులు నీలం మల్లేశం, జి.శ్రీనివాస్, పాండురంగం, రవి కుమార్, ప్రసాద్, జావిద్, దశరథ్, శ్రీనివాస్, కంపెనీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## ఎస్సి హాస్టల్‌ను సందర్శించిన అధికారులు

**వట్‌పల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
ఆదివారం మండలంలోని దేవునూర్ ఎస్సి హాస్టల్‌లో అన్నంలేక విద్యా ర్థులు పస్తులు అనే శీర్షికన వార్త దినపత్రికలో ప్రచురితమైన విషయం విదితమే. దీనితో సోమవారం ఎఎస్‌డబ్ల్యుఒ శ్రీనివాస్, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపిడిఓ అంజయ్యలు సందర్శించారు. విద్యార్థులు ఎదు ర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డెన్‌తోపాటు, వంట మనిషి, వాచ్‌మెన్‌ను 15రోజులలో మారుస్తామన్నారు. విద్యార్థులకు మరుగుదొడ్లు, హాస్టల్ చుట్టూ చెత్తాచెదారం, గడ్డిని తొలగిస్తామన్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పిస్తామన్నారు. విద్యార్థులు ఆదివారం ఎదుర్కొన్న భోజనం సమస్య పునరావృతం కాకుండా చూస్తామన్నారు.

## బిసిల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి

**-మండల పార్టీ అధ్యక్షులు రమణగౌడ్**

**శివ్వంపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
బిసిల రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని మండల పార్టీ అధ్యక్షులు రమణగౌడ్ అన్నారు. సోమవారం హైదరాబాద్ ఇందిరాపార్క్‌వద్ద బిసి లకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని నిర్వహించిన సత్యాగ్రహ దీక్షలో మాజీ జిల్లా గంగలసంస్థ చైర్మన్ చంద్రగౌడ్, రమణగౌడ్‌లు పాల్గొని డిమాండ్‌చేశారు. బిసిలకు న్యాయం జరిగేంతవరకు తప్పకుండా పోరాటం చేస్తామని ఆయన అన్నారు. బిసిసంఘం జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య, శాసనమండలి మాజీ చైర్మన్ సిరికొండ మధుసూదనచారితో పాటు సత్యాగ్రహదీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా రమణగౌడ్ మాట్లాడుతూ బిసిల రిజర్వేషన్ 42శాతం అమలుచేసి బిసిలకు న్యాయం చేయాలని రాజ్యాంగబద్ధంగా బిసిలకు కేటాయించిన రిజర్వేషన్ల శాతాన్ని అమలుచేయాలని ఆయన అన్నారు.

## బకాయి కమిషన్‌లు చెల్లించండి

**-తహసీల్దార్‌కు రేషన్ డీలర్ల వినతి**

**న్యాల్‌కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
తామెదురుకొంటున్న సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమవుతోందని నిరసన వ్యక్తం చేస్తూ సోమవారం రేషన్ డీలర్లు తహసీల్దార్ ప్రభులుకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మాట్లాడతూ తమకు 5నెలలుగా కమిషన్ అందడం లేదని, కమిషన్ అందకుంటు తాము తమ కుటుంబాలను పోషించుకునేదెలా అని ప్రశ్నించారు.అప్పులు చేసి కుటుంబాన్ని పోషించుకోవాల్సిన దయనీయ స్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. రేషన్ దుకాణాల అద్దెలు, హమాలీలకు కూలీలు చెల్లించుకునే స్థితిలో లేమని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి తమకు బకాయి పడ్డ 5నెలల కమిషన్‌ను వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. ఎన్నికల సందర్భంగా రేషన్ డీలర్లకు చేసినహామీలను ప్రభుత్వం అమలుచేయాలన్నారు. ప్రభుత్వం స్పందించ కుంటే ఆందోళన తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో రేషన్‌డీలర్లు మహ్మద్ జమీల్, మాణిక్, వీరశెట్టి, సుజాత, రహిమోద్దిన్, జలీల్, ప్రవీణ్, కాశీనాథ్, ధనరాజ్, సంగమేష్, సంగన్న పాల్గొన్నారు.

## పండగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

**-పీస్ కమిటీ సమావేశంలో డిఎస్‌పి సైదానాయక్**

**జహీరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
పండగలను ప్రజలు ప్రశాంతంగా భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని డిఎస్‌పి బి,సైదానాయక్ సూచించారు. సోమవారం పట్టణంలోని శంకర్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ సమావేశానికి డిఎస్‌పి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగిచారు. వినాయకచవితిని పురస్కరించుకుని జరుపు కునే నవరాత్రి ఉత్స వాలను నిమర్జనం వరకు లంబోదరుడి మండపాల వద్ద ఆయా మతాల వారు ఒకొరికి ఒకరు సహకరించుకుంటూ పండగ లను పసందుగా జరుపుకోవాలన్నారు. జహీరాబాద్ మతసామరస్యాలకు నిలయమని, అదే ఒరవడిని ఈ సారి కూడా కొనసాగేలా చూడాలని ఆయా మత పెద్దలకు సూచించారు. పోలీసులు అనుమతి పొందాకే ఏకదంతుడి మండపాలు ఏర్పాటు చేసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. సమా వేశంలో పట్టణ సిఐ శివలింగం, పట్టణ, చిరాగ్‌పల్లి పోలీసు ఠాణాల ఎస్ఐలు వినయ్‌కుమార్, రాజేందర్‌రెడ్డి, తహసీల్దార్ దశరథ్, మున్సిపల్ ఏఈ నాగరాజు, విద్యుత్ ఏఈ నాగరాజు, ఇరిగేషన్ ఏఈ జానకిరామ్‌లతో పాటు ఆయాశాఖల అధికారులు, ఆయాపార్టీల నాయకులు, గణేష్ మండ పాల నిర్వాహకులు పాల్గొన్నారు.

## ఐదు నెలల కమిషన్ వెంటనే విడుదల చేయాలి

**-తహసీల్దారుకు రేషన్ డీలర్ల వినతి**

**జోగిపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
రేషన్ డీలర్లకు చెల్లించాల్సి న ఐదు నెలల కమీషన్‌ను వెంటనే విడుదల చేయాలని అందోలు రేషన్‌డీలర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్స్ అసోసియేషన్ మండల అధ్యక్షులు అల్లె మహేష్, ప్రధానకార్యదర్శి యాదయ్యలు మాట్లాడుతూ ఐదు నెలలుగా కమిషన్ అందక డీలర్లు చాలా ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు డీలర్లకు చెల్లించాల్సి న కమిషన్ విషయంలో తీవ్ర జాప్యం కారణంగా కనీసం బియ్యంవస్తే దించుకునేందుకు హమాలీ డబ్బులకుకూడా డీలర్లు ఇబ్బందు లు ఎదుర్కొంటున్నట్లు వారు తెలిపారు. పాతపద్ధతిలోనే ఒకేసారి మొత్తం కమిషన్ చెల్లించాలని వారు డిమాండ్‌చేశారు. అలాగే మానిఫెస్టోలో పెట్టిన విధంగా డీలర్లకు ఐదువేల గౌరవవేతనం, రూ.300 కమిషన్ వెంటనే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రేషన్ డీలర్స్ అసోసియేషన్ నాయకులు ఎలగోరి సత్యం, జుట్టు విఠల్, శ్రీకాంత్, సాయి, ప్రకాశ్‌రెడ్డి, సాయి, పి.మహేష్, శంకర్, దత్తు, కుంట్ల దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

## మట్టి వినాయక విగ్రహాలను ప్రోత్సహించాలి

**జోగిపేట,ఆగస్టు 25, ప్రభాతవార్త:**
పర్యావరణానికి హాని కలగకుండా ఉండాలంటే మట్టి వినాయక విగ్రహాలనే వాడాలని జోగిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్ అన్నారు. సోమవారం కళాశాలలోని వృక్షశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలను నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి వినాయక విగ్రహాలు ఎంతో అవశ్యకమని తెలిపారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీకాంత్, లెక్చరర్లు డాక్టర్ ఎ.శైలజ, సంయమి, మాధవి, కల్పన, టి.విద్యాసాగర్, బి.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు

**వెల్దుర్తి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
మండలకేంద్రమైన వెల్దుర్తిలోని ఉన్నతపాఠశాలలో ఇటీవల పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభను కనబరిచి మొదటి రెండవ మూడవ ర్యాంకులో వచ్చిన విద్యార్థులకు ఘనంగా సన్మానించారు. సోమవారం పాఠశాలలో ర్యాంకులు సాధించిన వారిని ఘనంగా సత్కరించారు. సందర్భంగా మొమెంటోలు అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలోహెచ్ఎం సాంబయ్య. పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# యూరియా కోసం రైతన్నల రోడ్డు బాట...

**-రైతన్నల కష్టాలు ప్రభుత్వానికి పట్టవా..?**



రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

**చిలిపిచెడ్, ఆగస్ట్ 25, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్రంలో రైతులు అధిక పంటలను పండించడంలో మెదక్‌జిల్లా అగ్రగామిగా నిలుస్తుంది. అలాంటి మెదక్ జిల్లాలో రైతులకు యూరియా లభించక రైతుల పాలిట శాపంగా మారింది. పొద్దు పొడవక ముందే రైతు వేదికల వద్ద బారులు తీరిన సమయానికి అందడం లేదని ఆగ్రహానికి లోనయ్యారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల వివక్ష చూపుతోందని నిరసిస్తూ చిలిపిచెడ్ మండల కేంద్రంలో శిలాంపల్లి గేటువద్ద జోగిపేట్ నర్సాపూర్ జాతీయ రహదారిపై బైఠాయించి, రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుకు అడ్డంగా ముళ్ళ కంచె వేసి రహదారులను నిలిపివేశారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పక్షాన వివక్ష చూపిస్తూ రైతులకు తీవ్ర అన్యాయం చేస్తుందని మండిపడ్డారు. వర్షాకాలం సీజన్లో రైతులు పండించే పంటకు ఎరువుల కొరత లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉండగా అలాంటి చర్యలు చేపట్టకపోవడంతో రైతులు అవస్థలు పడుతున్నారని ప్రభుత్వానికి రైతుల అవస్థలు అగుపడటం లేవా అని రైతన్నలు ఆగ్రహానికి లోనయ్యారు. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు అక్కడికి చేరుకొని సంబంధిత అధికారులతో మాట్లాడి రైతులకు నచ్చజెప్పడంతో ధర్నా విరమించారు. రాష్ట్రంలో యూరియా కొరత చర్చనీయాంశంగా మారింది. ఏమండలంలో చూసినా యూరియాకొరతతో రైతులు రోడ్డుపైకి వస్తున్న సంఘటనలు చూడొచ్చు. వర్షాకాలం సీజన్లో వ్యవసాయ పనుల్లో నిమగ్నమై ఉండాల్సి న రైతన్నలు రోడ్డుబాట పట్టాల్సి న పరిస్థితి నెలకొంది. ఉదయం 6గంటల నుండి సాయంత్రం వరకు రోడ్డుపై అవస్థలు పడాల్సి న పరిస్థితి అయినా ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని వారు వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందిస్తూ రైతులకు సకాలంలో యూరియా బస్తాలను అందించే దిశగా చర్యలు చేపట్టాలని వారు కోరారు లేనియెడల భారీ ఎత్తున ఆందోళన చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు.

## ఘనంగా బేటీ బచావో బేటీ పడావో

**జహీరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
మహిళా శిశు వికలాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సాధికారత కేంద్రం సమన్వయంతో సోమవారం బేటీ బచావో బేటీ పడావో, నషాముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాలను పట్టణంలోని డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాల వాడకానికి బానిసై నేరాలకు పాల్పడి తమ బంగారుభవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. కార్యక్రమంలో డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ మమ్మద్ ఆస్లాం, సిడిపిఓ అంజమ్మ, జిల్లా మహిళాసాధికారత కేంద్రం బాధ్యులు పల్లవి, బసవంత్‌రెడ్డి, ఎఫ్‌ఆర్ఓ సతీష్, ఉమేర, జిఎస్ విశాల, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హద్నూర్‌లో ఊపందుకున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం

**న్యాల్‌కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
మండలపరిధిలోని హద్నూర్‌గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లనిర్మాణం పనులు చురుకుగా కొనసాగుతున్నాయ. గ్రామానికి మొదటివిడతగా 58ఇళ్లు మంజూరుకాగా 46మంది లబ్దిదారులు తమ ఇంటినిర్మాణం పనులకు శ్రీకారంచుట్టి ప్రభుత్వం నుంచి మొదటిబిల్లులను సైతం అందుకున్నారు. ఇళ్ల నిర్మాణం ఊపందుకోవడంతో పంచాయతీ అధికారి ధనరాజ్, గ్రామ నాయకులు నరేష్, రమేష్, షకూర్‌మియాలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

## నానోయూరియా వాడండి

**-మండల వ్యవసాయ అధికారిణి దీపిక**

**నర్సాపూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
రైతులందరూ సంప్రదాయయూరియాపై ఆధారపడకుండా నానోయూరియాను వాడుకోవాలని నర్సాపూర్ మండల వ్యవసాయ అధికారిణి దీపిక సూచించారు. సోమవారం మండలపరిధిలోని కాగజ్‌మద్దూర్ గ్రామంలో శంకర్ అనే రైతు పొలంలో నానోయూరియాను పిచికారిచేసి రైతులకు చూపించారు. అంతేగాక నానోయూరియాపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ ఎఈఓ లక్ష్మీ, ఆత్మ బిటిఎం హరిత, రైతులు పాల్గొన్నారు.

## రేషన్‌డీలర్లకు కమిషన్ విడుదల చేయాలని తహసీల్దార్‌కు వినతి

**నర్సాపూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
రేషన్ డీలర్లకు కమిషన్ వెంటనే విడుదల చేయాలని రోరుతూ నర్సాపూర్ మండల తహసీల్దార్‌కు రేషన్ డీలర్లు వినతిపత్రం ఇచ్చారు. సోమవారం నర్సాపూర్‌మండల తహసీల్దార్ శ్రీనివాస్‌కు మండల రేషన్ డీలర్లు సంఘం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు సుధాకర్, ప్రధానకార్యదర్శి రవిగౌడ్, నాయకులు జైపాల్, ఫయుం, నర్సింలు, గోవర్ధన్‌రెడ్డి, సర్దార్, రాజు, శంకరయ్య, శ్రీశైలం, కుమ్మరి అశోక్, రమేష్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## మహాధర్నా కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ

**వెల్దుర్తి, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
మండల కేంద్రమైన వెల్దుర్తిలోని ఉన్నత పాఠశాలలో సోమవారం పిఆర్టియు టిఎస్ చేపట్టిన సిపిఎస్ రద్దు మహాధర్నా కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా మండలశాఖ అధ్యక్షులు శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి నవీన్‌కుమార్, సీతారాం, సీనియర్ నాయకులు సాంబయ్య, పిఆర్టియు సంఘం నాయకులు పాల్గొని ఆవిష్కరణ చేశారు. సెప్టెంబర్ ఒకటో తేదీన ఇందిరాపార్క్ హైదరాబాద్లో ఈకార్యక్రమం జరుగుతుందని, కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొని విజయవంతం చేయాలని శ్రీనివాస్ కోరారు.

## విద్యార్థులకు ఆటల పోటీలు

**మనూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
మండలంలోని ఆయా పాఠశాలల్లో విద్యను అందుకుంటున్న 14/17 వయసు గల విద్యార్థులకు (బాలురకు) 69 ఎస్‌జిఎఫ్ గేమ్స్ మార్చిఫాస్ట్, ఫ్లాగ్ హూస్టింగ్, గేమ్స్‌లను అధికారులు కాగడా వెలిగించి ప్రారంభించారు. ఖో-ఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను నిర్వహించారు. ఈనెల 26న బాలికలకు యథావిధిగా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ రాజశేఖర్ శెట్కార్, మనూర్, బోరంచ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వైద్యనాథ్, శివకుమార్‌స్వామి, దాత ప్రవీణ్‌కుమార్ చౌహాన్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పిడిలు రవికుమార్, మల్లికార్జున్, క్రీడాకారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## చదువుతో పాటు క్రీడలు ముఖ్యం

**పెద్దశంకరంపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
క్రీడాపోటీలలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో విద్యార్థులు సత్తాచాటాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెద్దశంకరంపేటలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంఈఓ వెంకటేశంతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రత్యేకంగా కృషి చేస్తుందని. అనేక సదుపాయాలను కల్పిస్తుందన్నారు. వీటిని వినియోగించుకుంటూ చదువుతో పాటు క్రీడలలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ సరిత, ప్రధానోపాధ్యాయులు శ్రావణ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన రైతులపై పోలీసులకు ఫిర్యాదు

**-రెవెన్యూ అధికారులపై గిరిజన రైతుల ఆగ్రహం...**

**-భూపట్టా కోసం చెప్పులు అరిగేలా తిరుగుతున్న గిరిజన రైతులు...**

**పాపన్నపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
రాష్ట్రప్రభుత్వం రైతుసంక్షేమమే లక్ష్యంగా పలుకార్యక్రమాలు చేపడుతున్నప్పటికీ అధికారుల ధనదాహానికి తోడు నిరక్ష్యవైఖరి మూలంగా రైతన్నలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి న దుస్థితి నెలకొంది. ఇదేమని అడిగితే ఏకంగా పోలీసులకు ఫిర్యాదు చేసి తమపై దాడికి వచ్చారంటూ భయభ్రాంతులకు గురిచేస్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వివరాల్లోకి మండల కేంద్రమైన పాపన్నపేట రెవెన్యూ కార్యాలయానికి బాధిత రైతు టేక్మాల్ మండల పరిధిలోని ముత్యాల బంధం తండాకు చెందిన రామావత్ సక్రు సోమవారం పలువురు గిరిజన రైతులతో కలిసి పౌతి కోసం వచ్చారు. గత కొన్నిరోజులుగా తహసీల్ కార్యాలయం చుట్టూ తమ మరణించిన తల్లి పేరుపై ఉన్న భూమిని తమపేరుమీదకు మార్చాలంటూ కాళ్ళకు చెప్పులరిగేలా తిరుగుతున్నాడు. అంతేకాకుండా వర్షాలు పెద్ద ఎత్తున కురుస్తున్నప్పటికీ తమ పొలంపనులుమానేసి ఏకంగా కుటుంబసభ్యులందరూ తహసీల్ కార్యాలయం ముందర పడిగాపులుకాస్తున్నా పట్టించుకోవడం లేదని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఐతే ఈ విషయమై స్థానిక ఆర్ఐని తమ పని ఎందుకు చేయడం లేదని రెవెన్యూ కార్యాలయం ముందే వివిధ పనులనిమిత్తం వచ్చిన రైతుల ముందు బాధితరైతు నిలదీశాడు. దీంతో ఆగ్రహించిన రెవెన్యూ అధికారులు తమపై రైతు దుర్భాషలాడుతున్నాడని, ఏకంగా పోలీసులకు ఫిర్యాదుచేయడంతో పోలీసులు రంగప్రవేశంచేశారు. ప్రజలపన్నుతో వేతనాలు తీసుకుంటున్న అధికారులు అదేప్రజలను పోలీసులకు అప్పగించడం ఎంత వరకు సమంజసం అని గిరిజనరైతులు ఆవేదన వ్యక్తంచేశారు. తమను ఇలాగే ఇబ్బందులకు గురిచేస్తే తహసీల్ కార్యాలయంముందు ఆత్మహత్య చేసుకుంటానని మీడియాముందు బాధితరైతు రమావత్ సక్రు వాపోయాడు. ఈవిషయమై పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్‌ను అడగగా తమపై గిరిజనరైతులు దుర్భాషలాడుతున్నారని రెవెన్యూ అధికారులు ఫిర్యాదుచేయడంతో పోలీసులను పంపించినట్లు వివరించారు. ఇదే విషయమై పాపన్నపేట తహసీల్దార్ సతీష్‌కుమార్‌ను వివరణకోరగా విచారణ చేస్తున్నామని, విచారణ అనంతరం సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## విద్యార్థులకు తాగునీటి సౌకర్యం కల్పించిన నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జ్

**నర్సాపూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
నర్సాపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ ఆర్వో వాటర్‌ప్లాంట్‌ను నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. సోమవారం మండలంలోని పెద్దచింతకుంట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మినీ ఆర్వోప్లాంట్‌ను ఆవుల రాజిరెడ్డి తన వ్యక్తిగత నిధులతో ఏర్పాటుచేయడం విశేషం. ఈసందర్భంగా ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ వ్యక్తిగతంగా చేపట్టిన ఈ చిన్న ప్రయత్నం వారికి ఉపయోగపడితే అదే నాకు గొప్ప ఆనందాన్నిస్తుందన్నారు. ఇది నా సామాజిక బాధ్యతగా భావిస్తున్నానని అన్నారు. కార్యక్రమంలో జిల్లాగ్రంథాలయసంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ సమీరా, అధ్యాపక బృందం, విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల పెండింగ్ కమిషన్ చెల్లించాలి

**పెద్ద శంకరంపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
గత ఐదు నెలలుగా పెండింగ్లో ఉన్న రేషన్ డీలర్ల కమీషన్ న్ను ప్రభుత్వం వెంటనేచెల్లించాలని కోరుతూ మండల రేషన్‌డీలర్ల సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. గత ఏప్రిల్ నుండి ఆగస్ట్‌వరకు రేషన్‌డీలర్ల కమిషన్ చెల్లించకపోవడంతో డీలర్లు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఈ విషయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పాతపద్ధతిలో కమిషన్ ఖాతాలలో జమచేసేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పండరి, వెంకటేశం, వినోద్, రామాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, కిష్టయ్య, నక్కసాయిలు, తదితరులున్నారు.

# సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోండి

**-తహసీల్దార్‌కు బిజెపి నాయకుల వినతి**




తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న బిజెపి నాయకులు

**జహీరాబాద్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
నియోజకవర్గంలోని మొగుడంపల్లి మండలంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం బిజెపి మండల అధ్యక్షులు శ్రీలత శ్రీకాంత్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ మండలంలోని ఆయా గ్రామాల్లో పరిపాలన కుంటుపడిందని విచారం వ్యక్తం చేశారు. గ్రామాల్లో వీధి దీపాలు వెలుగక గ్రామాలు చీకట్లో మగ్గుతున్నాయని, పరిశుభ్రత కానరాక ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారని గురబుతున్నారన్నారు. గ్రామాల్లోని రోడ్లు పాడవడంతో ప్రయాణించేందుకు ప్రజలు పరేషాన్ అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రైతులకు సమయానికి యూరియా అందడం లేదని, ఇందిరమ్మ ఇళ్లు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకే అందచేశారని మండిపడ్డారు. ప్రభుత్వ వసతి గృహాల్లోని విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నా పట్టించుకునే కరువయ్యారని విచారం వ్యక్తంచేశారు. మండలంలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి నౌబాద్ జగన్నాథ్, మొగుడంపల్లి మండల తాజీ మాజీ జడ్పిటిసి విజయమోహన్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు జగన్, నాయకులు రామన్న, మల్లికార్జునస్వామి, జైకృష్ణ, జగన్నాథ్, ప్రధాన కార్యదర్శులు నాందేవ్, శ్రీనివాస్, గిరిజన మోర్చా అసెంబ్లి కన్వీనర్ రవీందర్, రూప్‌సింగ్, మధు, ఉమేష్ లాల్, రవి, వెంకట్, పాండు, రమేష్, అనిల్, కళాకార, సుధాకర్, నాగయ్య స్వామి, సుభాష్, సయ్యద్ లతీఫ్ తదితరులు పాల్గొన్నారు.

## రామాయంపేట మురుగు కాలువ కష్టాలు

**-సమస్యలు పరిష్కరించాలని ప్రజల వేడుకోలు**

**రామాయంపేటమున్సిపాలిటీ, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
రామాయంపేట పట్టణ మూడవ వార్డులో మురుగుకాలువలతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ ఆసుపత్రి నుండి శారద ఫంక్షన్ హాల్ వరకు మురుగు నీరు పారడానికి తగిన మోరీలు, సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో కొద్ది ఇండ్లు మాత్రమే ఉండడంతో చిన్న చిన్న మోరీలు నిర్మించగా, ప్రస్తుతం ఈ ప్రాంతంలో గృహ నిర్మాణాలు భారీగా పెరగడంతో పాత మోరీలు సరిపోవడం లేదు. దీంతో మురికినీరు వీధుల్లో నిల్వ అవుతూ, ఇళ్ల మధ్యలోనుండే కాలువలుగా పారుతున్నాయి. దీంతో దోమల వృద్ధి, దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అదనంగా రాత్రిపూట లైట్లు లేకపోవడం, చెత్త బండి ప్రతిరోజు రాకపోవడం వల్ల చెత్త పేరుకుపోతూ సమస్య మరింత తీవ్రంగా మారింది. ఈ పరిస్థితిని తక్షణమే అధికారులు గమనించి మురుగునీటి పారుదల సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. సోమవారం కాలనీవాసులంతా తమ ఇళ్లమధ్యలో నిలిచిన మురికినీటి గుంటలను విలేకరులకు చూపించారు. కార్యక్రమంలో హస్నోద్దీన్, జమీర్, సల్మాన్, ఆరిఫ్, సయ్యద్, మొయిన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి హితమే పండగల పరమార్థం

**-మట్టిగణపతుల పంపిణీలో ఎమ్మెల్యే జిఎంఆర్**

**రామచంద్రాపురం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
హిందువులు సంప్రదాయబద్ధంగా జరుపుకునే ప్రతి పండగలో ఒక పరమార్థం దాగి ఉంటుందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డులో (సాయిఆబా నగర్ కాలనీలో) మట్టి వినాయకులను ఎమ్మెల్యే పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వినాయకచవితిని పురస్కరించుకుని ప్రతి ఒక్కరు పర్యావరణాన్ని కాపాడే మట్టి వినాయకులను ప్రతిష్ఠించుకుని పూజలు చేయాలని సూచించారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో మట్టి వినాయకలకు పూజతో కలిగే ప్రయోజనాలపై వివరించారు. జిహెచ్ఎంసి, మున్సిపాలిటీల ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ప్రజలందరికీ ఉచితంగా మట్టిగణపయ్యలను అందచేస్తున్నట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీవైస్‌చైర్మన్ రాములుగౌడ్, వెలిమల సొసైటీచైర్మన్ బుచ్చిరెడ్డి, మాజీకౌన్సిలర్లు శ్రీకాంత్‌రెడ్డి, నాగరాజు, రవీందర్‌రెడ్డి, కొమరయ్య, శ్రీశైలం, మల్లారెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ అజయ్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగ్ కళాశాలలో మెగా ప్లాంటేషన్

**జోగిపేట,ఆగస్టు 25, ప్రభాతవార్త:**
అందోలు-జోగిపేట మున్సిపాలిటీ ఆథర్యంలో అందోలులోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో మెగా ప్లాంటేషన్ కార్యక్రమాన్ని చేపట్టారు. వందరోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం నర్సింగ్ కళాశాలలో ప్లాంటేషన్ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మున్సిపల్ కమీషనర్ రవీందర్, సిబ్బంది మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ యాదమ్మ, మున్సిపల్ ఆర్ఐ నారాయణ, శానిటరీ ఇన్స్‌పెక్టర్ వినయ్, ఇఫ్తికార్‌ఆలీ, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గౌతాపూర్ పాఠశాలకు మినీ వాటర్ ప్లాంట్

**-జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి**

**చిలిపిచెడ్, ఆగస్ట్25, ప్రభాతవార్త:**
విద్యార్థులకు తాగునీటి సమస్య తీర్చిన మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుముల సుహాసినిరెడ్డి. మండలపరిధిలోని గౌతాపూర్ గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాలలో స్వర్గీయ కామ్రేడ్ చిలుముల కిషన్ రెడ్డి వర్ధంతి సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల త్రాగునీటికై సుమారుగా 65వేల రూపాయలతో 300లీటర్ల మినీ వాటర్‌ప్లాంట్‌ను ఆదివారం మెదక్ గ్రంథాలయ చైర్ పర్సన్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో కలిసి ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీ మేరకు విద్యార్థులకు మినీ వాటర్‌ప్లాంట్ ప్రారంభించడం జరిగిందని, ఇకమీదట విద్యార్థులకు ఏదైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ విట్టల్, మాజీ జెడ్పిటిసి చిలుముల శేషసాయిరెడ్డి, మాజీ మండల వైస్‌ఎంపిపి విశ్వాంబరస్వామి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ హంసిబాయ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయునీఉపాధ్యాయులు, మండల ముఖ్య నాయకులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## బైబిల్ హౌస్‌ను ప్రారంభించిన బిషప్

**మెదక్‌టౌన్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
మెదక్ సిఎస్ఐ చర్చ్ మహాదేవాలయ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన బైబిల్ హౌస్‌ను సోమవారం మోడరేటర్, మెదక్ ఇంచార్జ్ బిషప్ రేవా ప్రొఫెసర్. డా.రూబెన్ మార్క్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ విన్సన్, సినార్డ్ ట్రెజరర్ విమల్ సుకుమార్, మినిస్టీరియల్ సెక్రటరీ జయానంద్, లే సెక్రెటరీ ప్రభుకిరణ్‌కుమార్, ప్రాపర్టీ సెక్రటరీ మంత్రి సాల్మన్‌రాజ్, ప్రెస్ బీటర్ ఇంచార్జీ శాంతయ్య, గంట సంపత్, జిఎస్పి ప్యానెల్ మెంబర్స్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

**-మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు**

**సదాశివపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలమేరకు సదాశివపేట పట్టణంలోని 2,3 వార్డులలో పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లు నాటడం జరిగింది. మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిరు అధ్వర్యంలో మొక్కల పంపిణీ చేయడం జరిగింది. ఈసందర్భంగా చిరు మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలను నాటినట్లయితే మానవ మనుగడకు అవసరమైన ఆక్సిజన్ లభిస్తాయి అన్నారు. చెట్లు అధికంగా పెంచడం ద్వారా సకాలంలో వర్షాలు కురుస్తాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం బడుగు బలహీనవర్గాల కోసమై ఎన్నో పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు మునిపల్లి సత్యనారాయణ, లాల్‌బంద్ సత్యనారాయణ, జీవన్, వాజిద్, మోహిస్,చంద్రయ్య, మానయ్య, వార్డ్ ఆఫీసర్ విజయకుమార్, శ్యాం కుమార్ తదితరులు పాల్గొనడం జరిగింది.

## ముదిరాజ్‌ల సమస్యలు పరిష్కరించాలి

**పెద్ద శంకరంపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
ముదిరాజ్‌ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని మండల ముదిరాజ్‌సంఘం అధ్యక్షుడు పున్నయ్య అన్నారు. సోమవారం పెద్ద శంకరంపేటలో ముదిరాజ్ మహాసభ వ్యవస్థాపకులు కొరివి కృష్ణస్వామి ముదిరాజ్ 138వజయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చూపిన పోరాటస్ఫూర్తితో ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని, ప్రభుత్వం ముదిరాజులను బిసిడి నుండి బిసిఎలో చేర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జోడు రవీందర్, సంగమేశ్వర్, మానిక్యం, గాండ్ల సాయిలు, ప్రేమ్‌కుమార్, సర్వేశ్వర్ తదితరులు పాలొగన్నారు.

## పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

**-గణపతి మండపాలకు పోలీసు అనుమతి తప్పనిసరి**

**కంది, ఆగస్టు 25, ప్రభాతవార్త:**
వినాయకచవితి నవరాత్రులను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావారణంలో ఘనంగా జరుపుకోవాలని ఇంద్రకరణ్ పోలీసుఠాణా ఎస్ఐ సూచించారు. సోమవారం పోలీసు ఠాణాలో ఎస్ఐ మాట్లాడుతూ వినాయక మండపల ఏర్పాటుకు పోలీసుల అనుమతి, మండపానికి విద్యుత్ సరఫరా కొరకు విద్యుత్ అధికారుల అనుమతులను విధిగా తీసుకోవాలన్నారు. మండపాల ఏర్పాటుతో ప్రజలకు, వాహన చోదకులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. మైక్ వినియోగం ప్రభుత్వ ఆదేశాల మేరకు పాటించాలన్నారు. మండపాల వద్ద మధ్యం సేవించడం, అమ్మడం నేరమన్నారు. ప్రజలను ప్రేరేపించే పాటలు, నినాదాలు, ప్రసంగాలు చేయవద్దన్నారు. పోలీసు అధికారులు కేటాయించినమార్గంలో, సమయానుగుణంగా వినాయకనిమజ్జనం చేసుకోవాలన్నారు. పండగను ప్రశాంతంగా జరుపుకోవాలని, నిర్వాహకులు, ప్రజలు పోలీసులకు తమ వంతు సహకారం అందించాలని ఎస్ఐ సూచించారు.


డ్రైనేజీ స్లాబ్ నుండి పైకి ప్రమాదకరంగా ఉన్న సీకుల దృశ్యం

## ప్రాణాలు పోయేవరకు పట్టించుకోరా ?
### మాజీ కౌన్సిలర్ వేణుయాదవ్

**హుస్నాబాద్ టౌన్, ఆగస్టు 25 ప్రభాతవార్త :** పట్టణంలోని ఆరెపల్లి నుంచి పొట్లపల్లికి వెళ్లే ప్రధాన రహదారికి పక్కనే ఆనుకుని ఉన్న మురుగు కాలువపై ఉన్న స్లాబ్ శిథిలమై అందులో నుండి సీకులు బయటకు లేచి ప్రమాదకరంగా మారిందని, మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని మాజీ కౌన్సిలర్ మ్యాదరబోయిన వేణుయాదవ్ మండిపడ్డారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఆదివారం వార్డులో పిల్లలకు సెలవు దినం కావడంతో ఆడుకుంటూ వచ్చిన పిల్లలలో ఒక్కరు మోరీ పక్కనే జారిపడ్డాడని అయితే ఈ మోరీకి ఉన్న సీకులతో ప్రాణాలు పోయే అవకాశాలు ఉన్నాయని మొత్తుకుంటున్నా మున్సిపల్ శాఖ మరమ్మ తులు చేయించడం లేదన్నారు. ఏదో ఒక ప్రమాదం జరిగి ప్రాణాలు కోల్పోయే వరకు మరమ్మతులు చేయరా అని ప్రశ్నించారు. ప్రమాదం జరగకముందే ఈ మురుగు కాలువ స్లాబ్‌ను మరమ్మతులు చేయాలని లేని పక్షంలో కాలనీ వాసులతో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

## స్కాలర్‌షిప్, రీయంబర్స్‌మెంట్ విడుదల చేయాలి
### ఎబివిపి నగర కార్యదర్శి చరణ్


మాట్లాడుతున్న చరణ్

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న ఫీజ్ రీయంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్‌ను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎబివిపి నగర కార్యదర్శి భీమగోని చరణ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన మాట్లాడుతూ పెండింగ్ బిల్లులు ప్రభుత్వం చెల్లించకపోవడంతో రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థల యాజమా న్యాలు విద్యార్థులను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. విద్యా సంస్థలను అప్పులు తెచ్చి నడిపించుకుంటున్నామని, ప్రభుత్వం నుండి రావాల్సిన బకాయిలు రాకుంటే తామెలా జీతాలు, బిల్డింగ్‌ల అద్దెలు ఎలా చెల్లిస్తామని యాజమాన్యాలు ఆవేదన చెందుతున్నారని చెప్పారు. గత ప్రభుత్వం విద్యార్థులను పట్టించుకోని కారణంగానే అధికారం కోల్పోయిం దని గుర్తు చేశారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కాంగ్రెస్‌కు అదే గతిపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు రాహుల్, అంజి, రాకేష్, రాంచరణ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు యూరియా అందించలేని చేతకానీ ప్రభుత్వాలు


మాట్లాడుతున్న బిఆర్ఎస్ నాయకులు మహేష్

**కొమురవెల్లి, ఆగస్టు 25,ప్రభాతవార్త :** రైతులకు యూరియా అందించ డంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని బిఆర్ఎస్ పార్టీ నేత ఏర్పుల మహేష్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ, యూరియా కోసం రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రభుత్వాలలో చలనం లేద న్నారు. రైతులు దుకాణాల వద్ద పడిగాపులు కాస్తున్నా యూరియా దొరక డం లేదన్నారు. పోలీసుల పహారాలో యూరియా పంపిణీ చేసే దుస్థితి కాంగ్రెస్ సర్కారులోనే జరుగుతుందని చెప్పారు. రైతులకు సరిపడా యూరియాను అందించి ఆదుకోవాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పై ఉందన్నారు. రైతులకు యూరియా తిప్పలు తీర్చకుంటే రైతుల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో నాయకులు గజ్జె వెంకటేష్, బొచ్చు కిషన్, మ్యాకల రాకేష్ పాల్గొన్నారు.

## డీలర్ల సమస్యల పరిష్కారానికి కృషి
### రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం జిల్లా నూతన అధ్యక్షుడు వంగరి నాగరాజు


జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో సోమవారం నిర్వహించిన జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లాలోని 26 మండలాల అధ్యక్ష, కార్యదర్శులతో పాటు 686 మంది రేషన్ డీలర్ల ఆమోదంతో జిల్లా ఎన్నికను ఏకగ్రీవంగా నిర్వహించారు. జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా సిద్దిపేటకు చెందిన వంగరి నాగరాజు, ప్రధానకార్యదర్శిగా షబానా తాబుసంఅజీజ్, కోశాధికారి గా జూలూరి నాగభూషణంలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భం గా జిల్లా రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైనా వంగరి నాగరాజు మాట్లాడుతూ రేషన్ డీలర్ల సంక్షేమానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బెజ్జంకి వెంకటేశం, రవీందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, పద్మనరేందర్, వజ్రకన్ నరసింహ్మారెడ్డి, తిరుపతి, లక్ష్మణ్, సాయిలు, రమేష్, చంద్రం, రమేష్, జిల్లాలోని డీలర్లు తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని డీలర్లు శాలువాలతో ఘనంగా సత్కారించారు.

### నాచగిరిలో అభివృద్ధి పనులకు భూమిపూజ

**వర్గల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని నాచగిరి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మూత్రశాలలు, మరుగు దొడ్ల నిర్మాణానికి సోమవారం ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌గుప్త, ఎంపి డిఓ మశ్చేందర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు ఇచ్చే ఎస్‌బిఎం నిధుల నుండి రూ.3 లక్షల వ్యయంతో మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణం ప్రారం భించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన ధర్మకర్తలు కొత్తపల్లి శ్రీనివాస్, శేఖర్‌గుప్త, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


భూమిపూజ చేస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్‌గుప్త

బండి సంజయ్‌పై మహేష్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలంటూ

# బిజెపి ఆధ్వర్యంలో రాస్తారోకో


దిష్టిబొమ్మ దహనాన్ని అడ్డుకుంటున్న పోలీసులు

**హుస్నాబాద్ రూరల్, ఆగస్టు 25, ప్రభాతవార్త**

టిపిసిసిఅధ్యక్షుడు మహేష్‌గౌడ్ ఆదివారం కేంద్ర సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్‌పై చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసు కోవాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఆ పార్టీ శ్రేణులు సిద్దిపేట టూ హన్మకొండ జాతీయ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సంద ర్భంగా మహేష్‌గౌడ్ దిష్టిబొమ్మను దగ్ధం చేయాలని ప్రయత్నించగా అక్కడే ఉన్న పోలీసులు అడ్డుకు న్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బండి సంజయ్ దొంగ ఓట్లతో గెలిచాడని ఆరోపించిన మహేష్‌గౌడ్‌కు ఆ విషయాన్ని నిరూపించే దమ్ముందా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎనిమిది స్థానాలు బిజెపి గెలిస్తే, మరో ఎనిమిది ఎంపి స్థానాలు కాంగ్రెస్ గెలిచిందని అంటే దొంగ ఓట్లలో కాంగ్రెస్ హస్తం ఉన్నట్లేనా అని ప్రశ్నించారు. మహేష్‌గౌడ్ చేసిన ఆరోపణలు వెంటనే వెనక్కి తీసుకుని బండి సంజయ్‌కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

**అక్కన్నపేటలో...**

బండి సంజయ్‌పై టిపిసిసి అధ్యక్షులు మహేష్ గౌడ్ చేసిన ఆరోపణలు కరీంనగర్ పార్లమెంట్ ప్రజ లను దొంగలు అని హేళన చేసినట్లే అని బిజెపి మండల అధ్యక్షుడు రామంచ మహేందర్‌రెడ్డి ఆగ్ర హం వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రం లో ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ శ్రేణులతో కలిసి మాట్లాడారు. గతంలో బండి సంజయ్‌ని బిజెపి రాష్ట్ర అధ్యక్షునిగా అధిష్టానం తీసివేసిన సమ యంలో ఆయన బిసి అనే తీసేసారని ఆరోపణలు చేసి ఇప్పుడు దొంగ ఓట్లతో గెలిచారని పిచ్చిపట్టి నట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మహేష్ గౌడ్ ఆరోపణలతో ఉమ్మడి కరీంనగర్‌జిల్లా కాంగ్రెస్ పార్టీ ఖాళీ అవడం ఖాయమన్నారు.బండి సంజయ్ మీద అనవసరపు ఆరోపణలు చేస్తే ప్రత్యక్ష దాడు లకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు వేణుగోపాల్‌రావు,సంపత్, రవికుమార్, నునావత్ మోహన్‌నాయక్, రాజునాయక్, కళ్యాణ్ విష్ణు, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## మట్టి విగ్రహాలను పూజిద్దాం..పర్యావరణాన్ని కాపాడదాం
### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** కలెక్టరేట్‌లో జిల్లా కాలుష్య నియంత్రణ మండలి, వాసవీ మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాల పంపిణీ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతితో కలిసి మట్టి వినాయక విగ్రహాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పర్యావరణాన్ని కాపాడే దిశగా ప్రజలందరూ మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ పద్మజ రాణి, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, వాసవి మా ఇల్లు స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు తోపాజి అనంతకిషన్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలు పరిష్కరించండి
### కలెక్టర్‌కు సిపిఎం ప్రతినిధుల వినతి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వర్యంలో ఆగస్టు ఒకటి నుండి సిపిఎం గ్రామబాట కార్యక్రమంలో వచ్చిన సమస్యలను నేడు జిల్లా కలెక్టర్కు సిపిఎం ప్రతినిధులు వినతిపత్రం అందజేయడం జరిగిందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు అతిమేల మాణిక్ తెలిపారు. జిల్లాలో ప్రజలు, కార్మి కులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సిపిఎం ఆధ్వ ర్యంలో ఆగస్టు ఒకటి నుండి సిపిఎం గ్రామబాట కార్యక్రమంలో అనేక సమ స్యలు ప్రజలు తమ పార్టీ దృష్టికి తెచ్చారన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎస్ మైపాల్, పి కృష్ణ, నాయకులు అశోక్ పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి : జడ్పి సిఇఓ

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ప్రతీ ఒక్కరూ పర్యా వరణ పరిరక్షణకు కృషి చేయాలని జిల్లా పరిషత్ కార్యనిర్వహన అధికారి జానకిరెడ్డి అన్నారు. సోమవారం తెలంగాణ పంచాయతీరాజ్ నాల్గోవ తరగతి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సీఈఓ గారికి మట్టి గణపతి ప్రతిమను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు వై.నర్సింలు యాదవ్, ప్రధాన కార్యదర్శి రాహుల్ మాట్లాడుతూ మట్టి వినాయకులను ప్రతిష్ఠించి పూజలు చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ కార్యాలయ సిబ్బంది నర్సింలు, రవి, తదితరులు పాల్గొన్నారు.

## పార్కు స్థలాన్ని కాపాడండి

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** సంగారెడ్డి మున్సిపల్ పరిధిలోని 34 వార్డ్ రాంచంద్ర రెడ్డి కాలనీ సర్వే నెంబర్ 403లోని లేఔట్ నెంబర్ 18/91లోని పార్కు స్థలాము ఆక్రమణ పై చర్యలు తీసుకోవాలని సోమవారం ప్రజావాణి లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింట్లు కాలనీ వాసులు తెలి పారు. దాదాపు పదకొండు వందల గజలకు పైగా పార్కు స్థలం అక్రమనకు గురవుతుందని అన్నారు. గత కొన్ని రోజులుగా మళ్లీ నిర్మాణ పనులు మొదలు పెట్టారని వెంటనే లే అవుట్ పార్క్ స్థలాన్ని సర్వే చేయించి హద్దు బందులు నిర్ధారించి పార్క్ స్థలాన్ని కాపాడాలని వాళ్ళు వినతిపత్రంలో కోరారు.

### రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

**హత్నూర జులై 25, ప్రభాతవార్త :** అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ హత్నూర మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రేషన్ రేషన్ డీలర్లు సోమవారం హత్నూర తహసీల్దార్ ఫర్వన్‌షేక్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పెండింగ్ కమిషను విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి బకాయిలను వెంటనే విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమం లో డీలర్ల సంఘం అధ్యక్షులు మల్లేశం నాయకులు చెన్న, నరసింహులు జైరుద్దీన్, అఫ్జల్, రఘు, నర్సింలు, కృష్ణ, పురుషోత్తం కృష్ణా, రామస్వామి, మాణిక్‌రెడ్డి రాజు తదితరులు పాల్గొన్నారు.

### విశ్రాంతి ఉద్యోగుల మండల అధ్యక్షుడిగా పుండరీకంగౌడ్

**కౌడిపల్లి, ఆగస్టు 25, ప్రభాతవార్త:** తెలంగాణ విశ్రాంతి ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎం.పుండరీకంగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం కౌడిపల్లిలో విశ్రాంతి ఉద్యోగుల సంఘం ఎన్నికలను నిర్వహంచ గా, ఈ కార్యక్రమాన్నికి తెలంగాణ విశ్రాంతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్య క్షుడు జగదీష్‌చంద్రన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎన్నికల అధికారి హన్మంత్ రెడ్డి సమక్షంలో ఎన్నికలు నిర్వహించగా మండల అధ్యక్షులుగా ఎం.పుండరీకం గౌడు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధానకార్యదర్శిగా జి.పోచయ్య, కోశాధి కారిగా దేశాయిపేట మెట్టు రాములుశర్మ, గౌరవ అధ్యక్షుడిగా డి.పురుషోత్తం, ఉపాధ్యక్షులుగా జి.విఠల్, జి.రత్నమ్మ, సంయుక్త కార్యదర్శిగా బి.వెంకటయ్య, కార్యనిర్వహణ కార్యదర్శిగా ఎం.అరుణాలత, ప్రచురుణ కార్యదర్శిగా పి. గోపాల్‌రెడ్డి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో వీరితో పాటు తెలంగాణ విశ్రాంతి ఉద్యోగుల సంఘం రాష్ట్ర నిర్వహకులు శ్యాంసుందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. సత్యనారాయణ, సభ్యులు పిస్కే శేట్టయ్య తదితరులు పాల్గొన్నారు.


నియామకపత్రాన్ని అందుకున్న విశ్రాంతి ఉద్యోగి పుండరీకంగౌడ్

## ఎండు గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు
### ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఆగస్టు 25, ప్రభాతవార్త :** ఎండు గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి వారినుంచి 123 కిలోల ఎండు గంజాయిని రెండు కార్లను రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్టు మెదక్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ హరికిషన్ తెలిపారు. సోమవారం సంగారెడి లో ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం ఆదే శాల మేరకు, హరికిషన్, డీసీ, మెదక్, నవీన్‌చంద్ర, జిల్లా ఎక్సైజ్ సూపరిం టెండెంట్, సంగారెడ్డి సారథ్యంలో సోమవారం డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్, సంగా రెడ్డి టీమ్, స్టేషన్ సంగారెడ్డి టీమ్ కలిసి కంది మండలం ఐఐటీ హైదరాబాద్ లోగల చేర్యాల గేట్ వద్ద విశ్వసనీయ సమాచారంతో వాహనాలు తనిఖీలు చేయాగా ఒడిస్సాకి చెందిన ఉమాకాంత్ సబర్, మహారాష్ట్ర బీడ్ ప్రాంతానికి చెందిన అబ్దుల్ వహాబ్ సయ్యద్ అక్రమంగా ఎండుగంజాయిని రెండు ఇండికా కారులలో ఒడ్డిషా నుండి బీడ్, మహారాష్ట్రకి తరలిస్తుండగా పట్టుబడారని అన్నారు. రెండు వాహనాలను తనిఖీచేయగా ఏపి 35 ఏ ఇ 5979 వాహనం నుండి 69.5 కేజీలు ఎండు గంజాయిని, ఏపీ 39 జిఆర్ 5014 కార్ నుండి 53.3 కేజీ మొత్తంగా 122.85 కేజీ ఎండు గంజాయి మరియు 2 మొబైల్ ఫోన్లు, 2 ఇండికా కార్లను స్వాధీనపరచుకుని, తదుపరి చర్యల నిమిత్తం నింది తుడితులను సంగారెడ్డి ఎక్సైజ్ స్టేషన్ కి తరలించామని అన్నారు. దాడులలో సీఐ శంకర్, నజీర్ , ఎస్సై లు హనుమంతు, అనుదీప్, సతీష్, శ్రీనివాస్ రెడ్డి, దిలీప్ రెడ్డి మరియు కానిస్టేబుల్స్ అరుణజ్యోతి, అంజిరెడ్డి,పండరి, సుభాష్ ,శివ,రాజేష్ , శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జూదగృహంపై దాడి.. నలుగురు అరెస్టు
### -రూ. 5745 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం

**న్యాల్‌కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని టేకూర్ గ్రామం లో సోమవారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో జూదం ఆడుతున్నట్లు తెలుసుకున్న తాము జూదగృహంపై దాడి చేసి పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు ఎస్ఐ దోమ సుజిత్ పేర్కొన్నారు. ఎస్ఐ కథనం ప్రకారం ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు తెలుసుకుని పోలీసు సిబ్బందితో జూద గృహంపై దాడి చేశామన్నారు. జూదమాడుతున్న 4గురు తమ కాళ్లకు బుద్ధిచెప్పకుండా తాము పకడ్బందీగా, చాకచక్యంగా అందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. జూద గ్రస్థుల నుంచి 5745 రూపాయలను, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేశామన్నారు.

## మాజీ సర్పంచ్ చేసిన మోసాలపై చర్యలు తీసుకోవాలి
### -ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన ప్లాట్లను వారికే కేటాయించాలి
### -ఏటిగడ్డ కిష్టాపూర్‌లో నిరసన తెలిపిన బాధితులు

గజ్వేల్, ఆగస్టు 25 (ప్రభాతవార్త): ఆర్అండ్ఆర్ కాలనీ ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామంలో మాజీ సర్పంచ్ దామరంచ ప్రతాప్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలకు సంబంధిం చిన 20 ప్లాట్లను తక్కువ ధరకు కొనుగోలు చేసి మమ్మల్ని మోసం చేశారని ఏటిగడ్డ కిష్టాపూర్ గ్రామానికి చెందిన కరిని యాదగిరి, పంచర్ల మల్లేష్‌తో పాటు మోసపోయిన చెప్యాల ఉమ్మారెడ్డి, తీగుళ్ల కరుణాకర్‌రెడ్డి, సూరకొంటి మధుసూదన్‌రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామంలో ఎస్సీ,ఎస్టీలకు ప్రభుత్వం 20 ప్లాట్లు ప్యాకేజీ కింద మంజూరు చేసిందని తాజా మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి మాకు చెప్పినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం కేటాయించిన ప్లాట్లను మాకు ఎక్కడ కేటాయించారో మాకే తెలియకుండా మాతో బేరం కుదుర్చుకొని ఎస్సీ కాలనీలో వచ్చిన ప్లాట్లను రెడ్డి కాలనీకి మార్చి తక్కువ ధరకు కొనుగోలు చేశారని, అందులో సర్వే నెం.560/1, 1129, 1130, 1131, 1132, 1168, 746, 560/1560/2, 560/3 సర్వే నెంబర్‌లో 1168/ఏ, 560/1560/2, 560/3 ప్లాట్ నెం.805, 560/1, 748, 560/1, 749 ప్లాట్లను ప్రభుత్వం కేటాయించగా వాటిని తీసుకొని ఇండ్లను మంజూరు చేయిస్తానని చెప్పి ఒక్కో ప్లాటుకు రూ.7 లక్షలు కట్టించాడని, ఇండ్లను ఇప్పిస్తానని చెప్పి నమ్మించి తక్కువ ధరకు ప్లాట్లను తీసుకొని మోసం చేశాడన్నారు. ఇల్లు పాయే, ప్లాటు పాయే ఎట్లా బతకాలని కుటుంబం రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. మాజీ సర్పంచ్, అధికారుల అండతో తనకు ఇష్టంవచ్చిన విధంగా లబ్ధిదారులను మోసం చేశారన్నారు. గ్రామంలో ఏ అధికారి వచ్చినా ప్రజాప్రతినిధుల అండతోనే ఇలాంటి దారుణాలు చేస్తున్నారని, సామాన్య ప్రజలకు అధికారులు ఎలాంటి ప్యాకేజీ ఇవ్వకుండా ప్రజాప్రతినిధులకు మాత్రం ప్యాకేజీలతో సంబంధం లేకుండా ఇష్టం వచ్చిన విధంగా ప్లాట్లు కేటాయింపు చేస్తున్నారన్నారు. అదే గ్రామానికి చెందిన ఉమ్మారెడ్డి మాట్లాడుతూ మల్లన్నసాగర్ భూసేకరణ సమయంలో తనకు ఉన్న నాలుగు ఎకరాల వ్యవసాయ భూమికి భూమి కావాలని నేను ప్రభుత్వానికి ఇవ్వననే ఉద్దేశంతో 2013 చట్టం ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించానన్నారు. భూమికి భూమి కావాలని కొట్లాడు తున్న నన్ను మా గ్రామానికి చెందిన అరికెల భాస్కర్, అరికెల స్వామి, అరికెల చంద్రంతో పాటు మాజీ సర్పంచ్ నాకు తెలియకుండానే నా భూమి వద్దకు అధికారులను తీసుకెళ్లి దొంగ తీర్మానం చేయించి మా గ్రామంలో ఉన్న వారిని సాక్షులుగా పెట్టి భూమి పోయే విధంగా చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. నాకు ఉన్న పట్టా భూమికి డబ్బులు వచ్చినా సైతం నేను తీసుకోకుండా న్యాయస్థానంలో వేయడం జరిగిందని, గ్రామంలో ఇలాంటి ప్రజాప్రతినిధులు ఉండి ఇలాంటి మోసాలు చేయడం సరైందికాదన్నారు. ఇప్పటికైనా ఎస్సీ,ఎస్టీలకు సంబంధించిన ప్లాట్లను వారికే ఇప్పించేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిరసన చేస్తున్నట్లు తెలిపారు.

# దళితుల భూములు లాక్కుని.. దొరల భూములు వొదిలేస్తారా
### చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేష్



ఇండస్ట్రియల్‌పార్క్ కోసం సేకరించిన మ్యాప్. ఆకుపచ్చ రంగులో ఉన్నది దొర పలుకుబడితో వొదిలేపిన భూమి

**హుస్నాబాద్ రూరల్/ అక్కన్నపేట, ఆగస్టు25, ప్రభాతవార్త :** హుస్నాబాద్ నియోజకవర్గంలో విధులు నిర్వహించే ఆర్డీవో, తహసీల్దార్లు అధి కారులా లేక కాంగ్రెస్ పార్టీ నాయకులా అర్థం కావ డం లేదని చౌటపల్లి మాజీ సర్పంచ్ గద్దల రమేష్ విమర్శించారు. అక్కన్నపేట మండలంలోని చౌట పల్లి,తోటపల్లి గ్రామాల శివారులో స్థానిక ఎమ్మెల్యే, రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభా కర్ ఏర్పాటు చేయాలని చూస్తున్న ఇండస్ట్రియల్ పార్క్‌కు 125.36 గుంటల భూమిని సేకరించిన అధికారులు అందులో దళితులకు సంబంధించిన భూములే 150 మంది వరకు ఉన్నాయని, అయితే చౌటపల్లి క్రాస్‌రోడ్డుకు తూర్పు వక్క భూములు పూర్తిగా పోతున్నాయని, కానీ వాయువ్యం భూము ల్లో 20 ఎకరాలు ఉన్న పెద్ద దొరకు సంబంధించిన రోడ్డు పక్కన పనికి రాని 29 గుంటల భూమిని మాత్రమే తీసుకుంటున్నారని, ఆ భూసామి అయిన దొరగారు హైదరాబాద్‌లో ఉంటూ మంత్రితో పాటు కలెక్టర్‌లను కలిసి తన పరిచయాలతో పార్క్ మ్యాప్‌నే మార్చివేశారన్నారు. భూసామి దొరకు పెద్ద పెద్ద నాయకులు, కలెక్టర్లు మంత్రులతో పరిచయాలు ఉన్నాయని వారి భూమిని ఒదిలేసి బక్క రైతుల భూములు లాక్కోవడం సిగ్గుచేట న్నారు. పార్క్ కోసం నిర్వహించిన సర్వే తప్పుల తడకగా ఉందని ఆర్డీవో, తహసీల్దార్‌లను కలిస్తే వారు పట్టించుకోక పోగా కాంగ్రెస్ కార్యకర్తలలాగానే వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

ఈ విషయం లో మంత్రి,ఉన్నతాధికారులు స్పందించాలని పార్క్ కోస సేకరించే భూములను రీసర్వే నిర్వహించాలని డిమాండ్‌చేశారు. లేనిపక్షంలో భూములు కోల్పోతున్న రైతులతో కలిసి దీక్షలు చేపడతామని హెచ్చరించారు.

### ప్రశాంత వాతావరణంలో
## వినాయక చవితి పండుగ జరుపుకోవాలి : ఎస్ఐ సైఫ్ అలీ

**చిన్నకోడూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త :** యువత చెడు మార్గంలో నడవకుండా సన్మార్గంలో నడుచుకోవాలని ఎస్ఐ సైఫ్ అలీ అన్నారు. వినాయక చవితి సందర్భంగా యువతతో చిన్నకోడూరులో సోమవారం నిర్వహించినర సమావేశంలో ఆయన మాట్లాడారు. గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వినాయక విగ్రహాలు ప్రతిష్టించే నిర్వహకులు విధిగా అనుమతి తీసుకోవాలన్నారు. ప్రశాంత వాతావరణం లో వినాయక నవరాత్రోత్సవాలు జరుపుకోవాలన్నారు. సమావేశంలో మండల పరిధిలోని ఆయా గ్రామాలకు చెందిన యువకులు పాల్గొన్నారు.

## విద్యార్థులు కష్టపడే తత్వాన్ని అలవర్చుకోవాలి

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** విద్యార్థులు విద్యార్థి దశ నుండే కష్టపడే తత్వాన్ని, సామాజిక స్పృహను అలవర్చుకోవాలని కొల్గూరు మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రణీత రాణి అన్నారు. సోమవారం చేతన గ్రామీణ వికాస సేవా సమితి అందే వారి ఆధ్వర్యంలో పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు బ్యాగులు, పెన్నులు, నోటుపుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ప్రణీతరాణి మాట్లాడుతూ ప్రార్థించే పెదవుల కన్నా సహాయం చేసే చేతులు మిన్న అన్నారు. విద్యార్థులకు బ్యాగులు అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. చేతన గ్రామీణ వికాస సేవా సమితి అధ్యక్షుడు పోచయ్య మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లల్లో మంచి అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, శివలింగం, ఉజ్వల, బాపురెడ్డి, సభ్యులు పరశు రాం, సంతోష్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

## వ్యక్తిగత శుభ్రతతోనే ఆరోగ్యం

**నంగునూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని రాజగోపాల్‌పేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని పాలమాకుల షెడ్యూల్ కలాల అభివృద్ధిశాఖ వసతి గృహాన్ని ఆయన సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు సీజనల్‌గా డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యాలాంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుందన్నారు. వసతి గృహంలో పరిసరాల శుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించేలా దృష్టి సారించా లని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు అందించే కూరగాయలను, పప్పులను పరిశీలించారు. ప్రతి రోజు విద్యార్థులకు తాజా కూరగాయలు అందేలా చూడాలన్నారు. విద్యార్థులకు జ్వరం వస్తే వెంటనే ఆసుపత్రికి తీసుకరావాలని సూచించారు. ఆయన వెంట హెచ్ఈవో స్వామి, వార్డెన్ గణేష్, ఎఎన్ఎం పద్మ, హెల్త్ అసిస్టెంట్ మహేందర్‌లు ఉన్నారు.

## మట్టి గణపతులు పంపిణీ

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఆగస్టు 25, ప్రభాతవార్త :** సంగారెడ్డి మున్సి పల్ కార్యాలయంలో సోమవారం తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి గణపతిలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమం లో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, కాలుష్య నియంత్రణ మండలి పద్మ, మేనేజర్ సూర్యప్రకాష్, సిబ్బంది పాల్గొనడం జరిగినది. ఇట్టి కార్యక్రమంలో కమీషనర్ గారు మాట్లాడుతూ పట్టణ ప్రజలకు ముందుగా వినాయక చవితి శుభాకాంక్షలు తెలుపుతూ ప్రజలు అందరూ మట్టి గణపతి పూజించి పట్టణ నీటి కాలుష్యాన్నీ అరికడుదాం అని పిలుపునిచ్చారు.

**సిద్దిపేటలో...**

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని భారత్ నగర్ శ్రీవాణి స్కూల్‌లో సోమవారం వినాయక చవితి ముందస్తుగా విద్యా ర్థులు మట్టితో తయారుచేసిన వినాయక విగ్రహాలను తీసుకవచ్చి ప్రదర్శిం చారు. ఈ సందర్భంగా స్కూల్ డైరెక్టర్ సి.హెచ్. సత్యం మాట్లాడుతూ ప్రకృతిని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. వినాయకచవితి నవరాత్రోత్సవ సందర్భంగా ప్రతి ఒక్కరూ మట్టి విగ్రహాలను పూజించా లన్నారు. కెమికల్ విగ్రహాల వలన నీటి కాలుష్యంతో పాటు పర్యావర ణానికి హాని జరుగుతుందన్నారు. పర్యావరణం పరిరక్షణ అనే కాన్సెప్ట్‌ను విద్యార్థులకు పరిచయం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్, ఉపాధ్యా యులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీనిలయం, ఓల్డ్ ఏజ్‌హోంలలో...**

**సిద్దిపేట అర్బన్, ఆగస్టు 25, ప్రభాతవార్త :** జిల్లా కేంద్రంలోని సిదినదపేట శ్రీ నిలయం, ఓల్డ్‌ఏజ్‌హోమ్ భారత్‌నగర్‌లోలో సోమవారం అలయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాలను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ మట్టితో తయారు చేసిన వినాయకున్ని పూజించాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు గందె ఈశ్వర్ చరణ్, చంద్రకళ, గంగిశెట్టి కైలాసం, రేణుక, బాలచంద్రం, ఆత్మారాములు, వైకుంఠం, అంతయ్య, పెద్ది రామచంద్రం, సుజాత, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబీకులను పరామర్శించిన హరీష్‌రావు

**చిన్నకోడూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త :** మండల కేంద్రానికి చెందిన జంగపల్లి చంద్రం కుమారుడు మణివర్మ(25) రాష్ట్ర ఎస్సీ,ఎస్టీ కమిషన్ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ బంధువు మృతి చెందగా మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు సోమవారం బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు. మృతదేహానికి పూలమాలలు వేసి నివాళుర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఎదిగిన కొడుకుని కోల్పోయి శోక సంద్రంలో ఉన్న తల్లి దండ్రులను, కుటుంబీకులను ఓదార్చి అధైర్యపడొద్దని మనోధైర్యాన్ని ఇచ్చారు. ఆయన వెంట బిఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు రాధాకృష్ణశర్మ, మాణిక్యరెడ్డి, కాముని శ్రీనివాస్, కాముని ఉమేష్‌చంద్ర తదితరులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

**చిన్నశంకరంపేట, ఆగస్ట్ 25,ప్రభాతవార్త:** మండల పరిధి గజగట్లపల్లి గ్రామానికి చెందిన నారాయణ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ సోమ వారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న బిజెపి మండల నాయకుడు గుడికాడి లింగంగౌడ్ బాధిత కుటుంబానికి రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. నాయకులు సురేష్‌గౌడ్, ప్రవిణ్‌గౌడ్, చంద్ర మౌళి, లింగం రాజ్, ప్రభులు ఉన్నారు.

## బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ నాయకుల పరామర్శ

**చిన్నశంకరంపేట,ఆగస్ట్ 25,ప్రభాతవార్త:** మండల పరిధిలోని రుద్రారం గ్రామానికి చెందిన మైసయ్య ఇటీవల మృతిచెందగా, ఈ విషయం తెలుసు కున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి బాధిత కుటుం బాన్ని పరామర్శించి, రూ.10వేల రుపాయల ఆర్థిక సహాయాన్ని అందిం చారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, మాజీ సర్పంచ్‌లు పూలపల్లి యాదగిరి యాదవ్, మంచాల లక్ష్మణ్, కుమార్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, స్వామి, హెమ వెంకటేశం, బాగారెడ్డి, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## మహా గర్జనను విజయవంతం చేయండి
### -ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్

**గజ్వేల్ టౌన్, ఆగస్టు 25 (ప్రభాతవార్త):** వికలాంగుల హక్కుల పోరాట సమితి (విహెచ్‌పిఎస్) మహాగర్జనను విజయవంతం చేయాలని ఎమ్మార్పీ ఎస్ జిల్లా ఇంచార్జ్ మంద కుమార్ తెలిపారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సి పల్ పరిధి క్యాసారంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు మైస రాములు అధ్యక్షతన పెన్షన్‌దారుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంద కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు ఇచ్చిన మాటప్రకారం ఆసరా పెన్షన్లు,వృద్ధులకు,వికలాంగులకు, వితంతువు లకు పెన్షన్లు పెంచాలని, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి పెన్షన్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 9న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే పెన్షన్‌దారుల మహా గర్జన సభకు పెన్షన్‌దా రులు పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కప్ప యాదగిరి, వంటేరు చంద్రారెడ్డి, వద్దారం యాదమ్మ, బీడీ కార్మికులు కుమ్మరి లక్ష్మీనర్సవ్వ, దాసరి కవిత, కడారి గంగమ్మ, వద్దారం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మంద కుమార్

## పాదయాత్రగా సిద్ధిగణపతి ఆలయానికి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు

**అమీన్‌పూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధాశ్రీనివాస్‌గౌడ్ వారినివాసం నుండి రుద్రారంలోని సిద్ధి గణపతి(గణేష్‌గడ్డ) దేవాలయం వరకు సోమవారం పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇంచార్జి కాట శ్రీనివాస్‌గౌడ్ రుద్రారం గ్రామంలోని రామాలయం వద్ద పాదయాత్రలో చేరి కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలతో కలిసి రుద్రారం శ్రీగణేష్ దేవాలయం వరకు పాదయాత్రగా వెళ్ళారు. ఆలయానికి చేరుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణలతో ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందజేసి వారిని ఘనంగా సన్మానించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో అమీన్‌పూర్ కాంగ్రెస్‌పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి, శ్రీభ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవస్థానం చైర్మన్ సుధాకర్ యాదవ్, గుమ్మడిదల కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు నర్సింగ్‌రావు, జిన్నారం మాజీ ఎంపిపి సుధాకర్, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## సమస్యలను త్వరలో పరిష్కరించాలి

**-మండల బిజెపి అధ్యక్షుడు కావలి ఐలేష్**

**గుమ్మడిదల, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండల కేంద్రంలోని తెలంగాణ రాష్ట్ర బిజెపి పిలుపుమేరకు సోమవారం ఉదయం గుమ్మడిదల మండల అధ్యక్షుడు కావలి ఐలేష్ ఆధ్వర్యంలో మండలకేంద్రం మహారాజ్ చత్రపతి శివాజీ విగ్రహ ప్రాంగణం నుండి ప్రధానరహదారి గుండా ర్యాలీగావెళుతూ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ పరమేష్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సికింద్రాబాద్ నగర (ఆర్ఎస్ఎస్) వ్యక్త గోవర్ధన్‌రెడ్డి హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మండల అధ్యక్షులు కావలి ఐలేష్ మాట్లాడుతూ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు మండలంలోగల వివిధగ్రామాల్లోగల సమస్యలను వెలికితీస్తూ మండలంలో ప్రధాన సమస్యలు అన్నారం 261 సర్వే నంబర్‌లలో సుమారు 115 మంది రైతులకు 29మందికి కొత్త పాసుబుక్కులు ఇచ్చారు. మిగతా రైతులకు భూభారతి కొత్త పాస్ బుక్కులు ఇవ్వలేదు. అలాగే నల్లవల్లి డంపింగ్ యార్డ్ (ఎంఎస్‌డబ్ల్యు) కానుకుంట ప్రధాన రహదారి రోడ్డు వేయుటానికి మండలకేంద్రంలోగల 109 సర్వేనంబర్లలో రైతులకు న్యాయం చేయాలని 261 సర్వేనంబర్ కార్పొరేట్ పరిశ్రమల చెర నుండి అన్నారం రైతులకు, గ్రామస్థులకు విముక్తి కల్పించి కార్పొరేట్, రియల్ ఎస్టేట్ బడానాయకులకు అన్యాక్రాంతం అవుతున్న భూమిని రైతులకు భూభారతి పాస్ బుక్కులు ఇచ్చే అంతవరకు బిజెపి ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతంగా చేస్తామని అన్నారు. కార్యక్రమానికి జిల్లా కౌన్సిల్ సభ్యులు గోవర్ధన్‌రెడ్డి, గుమ్మడిదల మండల మహిళా మోర్చా అధ్యక్షురాలు సార సృజనలక్ష్మి, నాయకురాలు అనిత, ఉపాధ్యక్షులు సంజీవ, మాజీ మండల ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి, సీనియర్ నాయకులు బండి మాధవరెడ్డి, ముత్యాల గౌడ్, జనార్ధన్‌రెడ్డి సాయిబాబాగౌడ్, గంగాగౌడ్, వీరారెడ్డి, బూత్ అధ్య క్షులు సామల సత్యనారాయణ, యాదిరెడ్డి, జగదీష్‌రెడ్డి, అన్నారం గ్రామ స్థులు భానుచందర్, నారాయణ, యాదగిరి, సురేష్, స్థానికులు, మహిళా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఐదునెలల రేషన్‌డీలర్ల కమిషన్ డబ్బులు చెల్లించాలి

**-అమీన్‌పూర్ రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు గోక మహిపాల్‌రెడ్డి**

**అమీన్‌పూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

రాష్ట్రంలోని రేషన్ డీలర్లకు ఏప్రిల్ నుండి ఆగస్టు వరకు 5నెలల కమిషన్ డబ్బులురాక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అమీన్‌పూర్ మండల రేషన్‌డీలర్ల సంక్షేమసంఘం అధ్యక్షుడు గోక మహిపాల్‌రెడ్డి వాపోయారు. ఈమేరకు సోమవారం అమీన్‌పూర్ మండల కార్యాలయంలో తహసీల్దార్ వెంకటేష్‌కు అమీన్‌పూర్ రేషన్‌డీలర్లు ఐదునెలల కమిషన్ డబ్బులు చెల్లించాలని కోరుతూ రేషన్‌డీలర్లు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా అమీన్‌పూర్ రేషన్‌డీలర్ల సంఘం అధ్యక్షుడు గోక మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ డీలర్లకు ఇచ్చే కమిషన్‌ను వేరువేరుగా కాకుండా పాతపద్ధతిలో రేషన్‌డీలర్ల కమిషన్ ఒకేసారి విడుదల చేసి ఖాతాలో జమ అయ్యేవిధంగా చూడాలని కోరారు. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా డీలర్లు 2025 ఏప్రిల్, మే నెలల వారీగా బియ్యం పంపిణీ చేయడం జరిగిందని, ఆతర్వాత జూన్, జూలై, ఆగస్టు నెలల బియ్యం ప్రజలకు ప్రభుత్వ ఆదేశానుసారం ఉదయం 7గంటల నుండి రాత్రి 10గంటల వరకు అత్యంత పారదర్శకంగా పంపిణీచేయడం జరిగిందని తెలిపారు. దాదాపు 20,000 రూపాయల షాప్ అద్దెభారాన్ని భరించలేక అప్పుల ఊబిలోకి కురుకపోతున్నామని ఆయన వాపోయారు. తమ రేషన్‌డీలర్ల బతుకు అగమ్యగోచరంగా తయారైందని ఆయన బాధ వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీమేరకు 300 రూపాయల కమిషన్, 5000 రూపాయల గౌరవవేతనం వెంటనే ఇచ్చేవిధంగా ప్రభుత్వం చొరవ తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఇకనైనా స్థానిక, జిల్లా అధికారులు తమ సమస్యలపై స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి తమ సమస్యను పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చినవారిలో ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, రేషన్ డీలర్లు ఉన్నారు.

## ఒక్కో రైతుకు రెండు బ్యాగుల యూరియా

**-మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రావు**

**గుమ్మడిదల, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

గుమ్మడిదల మండలంలోని సోమవారం ఒకరోజే 20 టన్నుల యూరియాను ప్రతి ఒక్క రైతుకు రెండు బ్యాగుల చొప్పున పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో దశలవారీగా యూరియా సరఫరా సెంటర్‌కు వస్తున్నందున మిగిలిన రైతులకు కూడా ఒక్కొక్క రైతుకు రెండుబ్యాగులచొప్పున పంపిణీచేయడం జరుగుతుందని తెలిపారు. రైతులు ఎవరుకూడా యూరియా రాదేమో అనిబ అపోహ చెందకుండా వీలైనంత మటుకు నానోయూరియా నానో డిఏపి ద్రావణం వాడుకొని పంటలను రక్షించాలని కోరారు. ఈకార్యక్రమంలో వ్యవసాయ పరపతి సంఘం అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సెక్రటరీ లక్ష్మణ్‌నాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## కమిషన్‌ను విడుదల చేయండి

**-తహసీల్దార్‌కు రేషన్ డీలర్ల వినతి**



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న రేషన్‌డీలర్లు

**మనూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

బకాయిపడిన రేషన్‌డీలర్ల కమిషన్‌లను విడుదల చేయాలని రేషన్ డీలర్లు సోమవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా రేషన్‌డీలర్లు మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్రప్రభుత్వాల సూచనమేరకు రేషన్ కార్డుదారులకు పారదర్శకంగా బియ్యంను పంపిణీ చేస్తున్నామన్నారు. అవస్థలు ఎదుర్కొంటూ లబ్దిదారులకు బియ్యం పంపిణీ చేస్తున్నా తమకు మాత్రం కమిషన్ ప్రభుత్వం విడుదలచేయడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రభుత్వం తాము పడుతున్న పాట్లను గుర్తించి తమకు రావాల్సిన బకాయి కమిషన్‌లను వెంటనే విడుదల చేయాలని మండల రేషన్ డీలర్లు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో డీలర్లు బ్రహ్మయ్య, సంజీవ్‌కుమార్, సిద్దిరం, అశోక్, అంజయ్య, మల్లేశం, షబ్బీర్, విఠల్, అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బా విద్యార్థులకు దుస్తుల పంపిణీ

**పుల్‌కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన పుల్‌కల్‌లోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో విద్యను ఆర్జిస్తున్న విద్యార్థినులకు సోమవారం అధికారులు ఏకరూప దుస్తులను పంపిణీ చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అందుకుని ఉన్నతులుగా ఎదగాలని అధికారులు సూచించారు. కార్యక్రమలో తహసీల్దార్ కృష్ణ, ఎంపిడిఓ ఆనందమేరీ, ఎంఈఓ శంకర్, పాఠశాల ప్రత్యేక అధికారి ఇందిర, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మర్కుక్‌లో ఘనంగా టిఎల్‌ఎం మేళా

**-టిఎల్‌ఎం మేళాలో మాట్లాడుతున్న సక్టోరియల్ అధికారి రమేష్**




టిఎల్‌ఎం మేళాలో మాట్లాడుతున్న సక్టోరియల్ అధికారి రమేష్

**మర్కుక్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

మండలకేంద్రమైన మర్కుక్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల ప్రాథమిక స్థాయి టిఎల్‌ఎం మేళా కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా మండల పరిధిలోని ప్రాథమికస్థాయి ఉపాధ్యాయులు తమ పాఠశాలలో విద్యార్థులకు బోధన అభ్యసన ప్రక్రియలో ఉపయోగించే ఉపకరణాలను మేళాలలో ప్రదర్శించడం జరిగింది. అనంతరం మండల విద్యాధికారి వెంకట రాములు, సెక్టోరియల్ అధికారి రమేష్, ఎస్ఐ దామోదర్‌లు మాట్లాడుతూ విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను వెలికితీయడానికి బోధనాభ్యసన పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, వాటిని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయులు సమర్థవంతంగా ఎఫ్ఎల్ఎన్‌లో ఉపయోగిస్తూ విద్యార్థుల ప్రగతి పెంపొందించడానికి కృషి చేస్తున్నారని తెలిపారు. మండలస్థాయిలో ప్రదర్శించిన టిఎల్ఎంల నుండి జిల్లా స్థాయికి ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఈకార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు వెంకటేశం, శంకర్‌రెడ్డి, రిసోర్స్ పర్సన్స్, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈమేళాలో తెలుగులో ప్రథమ బహుమతి కె.సంతోషిమాత (అంగడికిష్టాపూర్), ద్వితీయ బహుమతి వి.సంతోషికుమారి (వరదరాజ్‌పూర్), ఆంగ్లంలో ప్రథమ బహుమతి ఉమారాణి (చేబర్తి), ద్వితీయ బహుమతి శ్రీకాంత్ (పాతూరు), గణితంలో ప్రథమ బహుమతి బి.కవిత (వరద రాజ్‌పూర్), ద్వితీయ బహుమతి సిహెచ్.సుచిత (పాములపర్తి), పరిసరాలవిజ్ఞానంతో ప్రథమబహుమతి బి.హారిక (అంగడికిష్టాపూర్), ద్వితీయబహుమతి జె.శ్రీకాంత్ (పాతూరు) గెలుపొందారు. వారందరికీ బహుమతులు, ధృవీకరణపత్రాలను అందజేశారు.

## నల్లవాగు ప్రాజెక్టు నుంచి సాగునీరు విడుదల

**-ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**



సాగునీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**సిర్గాపూర్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని నల్లవాగు ప్రాజెక్టు నుంచి కుడి, ఎడుమ కాలువల నుంచి పంటల సాగుకు సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సోమవారం అధికారులతో కలిసి సాగునీటిని విడుదలచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ పూడుకుపోయిన కాలువను శుభ్రంచేయించి పంటలసాగుకు నీటిని సరఫరాచేశామన్నారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్‌లు, నాయకులు యాదవరెడ్డి, మోహన్‌రెడ్డి, జిత్తురెడ్డి, మల్లొడ్డి తుకారం, జైరాజ్, కృష్ణ, బండారి సాయిలు, శ్రీనివాస్‌పాటిల్, గుండు మోహన్, జమీల్, పురుషోత్తం, నరేందర్, రాజుగౌడ్, శ్యాంప్రసాద్, మహేశ్వర్‌పాటిల్, వీరచారి లక్ష్మయ్య, కృష్ణమూర్తి, సంతోష్, సురేష్, నరసింహారెడ్డి, ఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్ హామీ



ప్రజలసమస్యలను అడిగితెలుసుకుంటున్న కార్పొరేటర్ పుష్పనగేష్

**రామచంద్రాపురం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ 4,5,6 బ్లాక్‌ల్లో నెలకొన్నసమస్యలను పరిష్కరించేందుకు చర్యలుతీసుకుంటామని కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యురాలు బూరుగడ్డ పుష్పనగేష్ కాలనీలవాసులకు హామీచేశారు. సోమవారం కార్పొరేటర్ ఆయా బ్లాక్‌లలో తిరుగాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయా బ్లాక్‌లలో తాగునీటి సమస్య ఉందని, బోరు వెల్‌లను మరమ్మతులు చేయించాలని కాలనీవాసులు కార్పొరేటర్ దృష్టికి తీసుకుపోగా వెంటనే తన స్వంతనిధులతో బోర్‌వెల్‌ను మరమ్మతులు చేయిస్తానని, మంచినీటి సమస్యను పరిష్కారం అయ్యేలా గతంలో కంటే అధిక సమయం మంచినీటిని సరఫరా చేయాలని జలమండలి అధికారులకు ఫోన్‌లో ఆదేశించారు. రేషన్ కార్డులు, పెన్షన్‌లు, డబుల్ బెడ్‌రూంలు లేవని ప్రజలు కార్పొరేటర్‌తో మొరపెట్టుకోగా మీసేవలో దరఖాస్తులు చేసుకోవాలని కార్పొరేటర్ పుష్ప ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు కేశవులు, సిఎం మల్లేష్, బుల్ల అశోక్, బేగరిబాలరాజు, పుర్ర శ్రీను, ఎర్ర హన్మంతు, కృష్ణ, శ్రీకాంత్, మల్లికార్జున్, రమేష్, ప్రవీణ్, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే విగ్రహానికి నివాళి అర్పించిన నాయకులు

**నారాయణఖేడ్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ మండల్ పంచాంగమా గ్రామంలోగల వారి వ్యవసాయ క్షేత్రంలో గాల కిష్టారెడ్డి సమాధికి యువనేత సాగర్ శెట్కార్ పూలు వేసి నివాళులు అర్పించారు. వారితో నారాయణఖేడ్ నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శివకాంత్‌పటేల్, మనూర్ మండల్ యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సంగమేష్‌పటేల్, మనోజ్‌పటేల్, అనిల్, రాజు తదితరులు ఉన్నారు.

## రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

**-మండల వ్యవసాయ అధికారి చైతన్య**

**పుల్‌కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

సబ్సిడీపై వ్యవసాయ పరికరాలను రైతులకు అందచేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి బి.చైతన్య పేర్కొన్నారు. వ్యవసాయ పరికరాలను అందుకునేందుకు రైతులు దరఖాస్తుపత్రంతోపాటు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ట్రాక్టర్ ఆర్‌సి, పాస్‌పోర్టు ఫోటోలతో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. పట్టాదారు పాసుపుస్తకం ఉన్న చిన్న, సన్నకారు, ఎస్‌సి, ఎస్టీ, మహిళా రైతులకు మొదటి ప్రాదాన్యత ఇస్తామన్నారు. ఒక లక్ష అంతకన్నా ఎక్కువ లబ్ది పొందే రైతులకు ఒక ఎకరం భూమి ఉండాల్సి ఉంటుందన్నారు. రైతులకు అందుబాటులో హ్యాండ్ స్ప్రేయర్‌లు 172, రోటవేటర్‌లు 9, సీడ్‌కమ్ ఫర్టిలైజర్ డ్రిల్ 2, డిస్క్ హ్యారో, కల్టివేటర్, ఎంబి ప్లవ్, కేజ్ వీల్‌లు 14 చొప్పున, బ్రష్‌కట్టర్ 6, పవర్ వీడర్ 2, పవర్ టిల్లర్ 6, స్ట్రాబెల్స్ 3, బండ్ ఫార్మర్ 1 అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు ఈ ఎల 30వ తారీఖు లోగా పుల్‌కల్‌లోని రైతు వేదికలో ధరఖాస్తులు చేసుకోవాలని ఏఓ బి చైతన్య సూచించారు.

## ఆస్తిపన్ను ఎగగొడుతున్న జెఎన్టీయూ కళాశాల

**-కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన కోర్పోల్ యువకులు**



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న కోర్పోల్ యువకులు

**చౌటకూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని సూ్తాన్‌పూర్ గ్రామంలోని జెఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఆస్తిపన్నులను చెల్లించడం లేదని కోర్పోల్ గ్రామానికిచెందిన యువకులు సోమవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. జెఎనియు నిర్మాణంలో సరాఫ్‌పల్లి, సుల్తాన్‌పూర్, కోర్పోల్ గ్రామాల శివారు భూములు కోల్పోయారని,ఆయా భూముల్లో పెద్ద ఎత్తున నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. ఒక్కో పంచాయతీకి లక్ష రూపాయల చొప్పున ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉందన్నారు. కళాశాల ఆస్తిపన్ను చెల్లిస్తే గ్రామాల్లో అభివృద్ధి పనులు ఏర్పడతాయని, అందుకు కలెక్టర్ స్పందించి ఆస్తిపన్ను చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వినతిచేశారు.

## శ్రీకేతకి ఆలయహుండీ రూ.35లక్షలు



శ్రీకేతకి ఆలయంలో హుండీని లెక్కిస్తున్న దృశ్యం

**ఝరాసంగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన ఝరాసంగంలో పార్వతీదేవి సమేతంగా కొలువుండి దక్షిణకాశీగా భక్తులతో నిత్యపూజలందుకుంటున్న శ్రీకేతకిసంగమేశ్వర స్వామి ఆలయహుండీని సోమవారం లెక్కించారు. 32రోజులకుగాను ఆలయానికి చేరుకున్న భక్తులు తమ మొక్కుబడిలో భాగంగా స్వామి వారికి 34లక్షల 88వేల120 రూపాయలను సమర్పించుకున్నారు. హుండీలెక్కింపు కార్యక్రమంలో పర్యవేక్షకులు రంగారావు, చైర్మన్ చంద్రశేఖర్, ఈఓ శివరుద్రప్ప, ధర్మకర్తలు మల్లయ్యస్వామి, నావాజ్‌రెడ్డి, మల్‌శెట్టి, మల్లప్ప, ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్, నారాయణ, శ్రీనరసింహ సేవాసమితి హైద్రాబాద్ బాధ్యులు, అలయ అర్చకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# బుద్ధులు చెప్పే మాస్టారే.. తిడుతుండు

**-తిట్టే కిష్టయ్య పంతులు మాకొద్దు-**



ధర్నా చేస్తున్న విద్యార్థులు

**నారాయణఖేడ్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు బుద్ధులు చెప్పే మాస్టారు.. బూతుపురాణం విప్పాడని, ఉపాధ్యాయుడు దురుసుగా ప్రవర్తిస్తున్నాడని, విద్యార్థులు ఆందోళన చేపట్టారు. ఆంగ్లం బోధించే కిష్టయ్య పంతులు తన్నడం, ఇష్టంవచ్చినట్లు అసభ్యంగా మాట్లాడుతున్నాడని గంటసేపు గేట్ వద్ద ధర్నా చేశారు. అనంతరం విద్యార్థులు మాట్లాడుతూ అసభ్యంగా మాట్లాడే తిట్టే కిష్టయ్య పంతులు మాకు అద్దు అని విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఇలాంటి ఘటనలు కాకుండా చూసుకుంటామని సిబ్బంది చెప్పినప్పటికీ ఆందోళన కొనసాగించారు. తక్షణమే ఉపాధ్యాయుడు కిష్టయ్యను సస్పెండ్ చేయాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. నేను అలాంటి మాటలు మాట్లాడలేదని ఉపాధ్యాయుడు చెప్తున్నాడు. అంతలోపే విద్యార్థులు అబద్ధపు మాటలు మాట్లాడకు అనిచెప్పి డౌన్ డౌన్ కిష్టయ్య సార్ అని నినాదాలుచేశారు. ఈవిషయం విని పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్‌చారి సంప్రతించగా ఉపాధ్యాయులతో మీటింగ్ ఏర్పాటు చేశామని, మరోమారు ఆలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటాని ఆయన తెలిపారు.

## రైతులకు అందుబాటులో సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లు

**న్యాల్‌కల్, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

సబ్‌మిషన్ ఇన్ అగ్రికల్చర్ మెకానైజేషన్ (ఎస్ఎంఎఎం) 2025-26లో భాగంగా రైతులు సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందుకోవచ్చని మండల వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ పేర్కొన్నారు. ఏఓ అభినాష్ వర్మ కథనప్రకారం...వ్యవసాయం చేస్తూ ఇంతవరకు యాంత్రీకరణలో లబ్ధిపొందని రైతులకు మొదటిప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందన్నారు. ఎస్‌సి, ఎస్టీ, మహిళా, చిన్న, సన్నకారు (5 ఎకరాలలోపు ఉన్న రైతులకు) రైతులకు 50శాతం సబ్సిడీపై వ్యవసాయ పనిముట్లను అందుకోవచ్చన్నారు. చేతి పంపులు, లివర్ ఆపరేటెడ్ స్ప్రేయర్స్, రోటరవేటర్స్, బ్రష్‌కటర్, కల్టివేటర్ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు.. రోటవేటర్స్, కల్టివేటర్స్‌లు కావాల్సిన రైతు తమ ట్రాక్టర్ ఆర్‌సి ఉండాల్సి ఉంటుందన్నారు. సబ్సిడీపై వ్యవసాయ పరికారాలు అందుకునే రైతులు ధరఖాస్తు ఫారంతో పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, ట్రాక్టర్ ఆర్‌సిపుసక్తం జిరాక్సు పత్రాలు సమర్పించాలన్నారు. ధరఖాస్తు పత్రాలను పరిశీలించి ఎంపికైన రైతులు సంబంధిత పరికరం సరాఫరాచేసే కంపెనీ పేరుపై డిడితీస్తే పరికరాలు సరఫరా చేస్తారన్నారు. అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ అధికారి అభినాష్‌వర్మ సూచించారు.

## సబ్సిడీ యంత్రాలకోసం ఈనెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలి

**జోగిపేట, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

సబ్సిడీ యంత్రాలకోసం ఈనెల 30లోపు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీహరి ఒక ప్రకటనలో తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న రైతులకు యాభైశాతం సబ్సిడీతో, ఐదెకరాలకన్నా ఎక్కువ ఉన్న రైతులకు నలభైశాతం సబ్సిడీతో వివిధ రకాల పనిముట్లు అందచేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఇందుకోసం తమ గ్రామాల పరిధిలోని రైతు వేదికల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హుల ఎంపిక మండల కమిటీ ద్వారా చేస్తారని తెలిపారు.

## బకాయిపడ్డ కమిషన్‌ను చెల్లించాలి

**-తహసీల్దార్‌కు రేషన్ డీలర్ల వినతి**

**నాగల్‌గిద్ద, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

గత 5మాసాలుగా రేషన్‌బియ్యం సరఫరాచేసిన కమిషన్ అందక అవస్థలు పడుతున్నామని రేషన్‌డిలర్లు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం తహసీల్దార్ శివకృష్ణకు మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షులు గడ్డ సంగిశెట్టి ఆధ్వర్యంలో డీలర్‌లు వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా రేషన్ డీలర్లు మాట్లాడుతూ కమిషన్ అందక అవస్థలు పడుతున్నామని, వెంటనే కమిషన్ అందించాలని వినతిచేశారు. కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం మండల ఉపాధ్యక్షులు కుశాల్‌రావు, డీలర్లు రాందాస్, ప్రకాష్, మల్లికార్జున్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కమిషన్‌ను ఇప్పించండి

**-తహసీల్దార్‌తో రేషన్ డీలర్లు**



తహసీల్దార్‌కు వినతి పత్రం అందచేస్తున్న రేషన్‌డీలర్లు

**చౌటకూరు, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

రేషన్‌కార్డుదారులకు రేషన్‌బియ్యంను సరఫరాచేసినా తమకు రావాల్సిన కమిషన్ విడుదలచేయకపోతుండటంతో అవస్థలు పడుతున్నామని రేషన్‌డీలర్లు ఆవేదన వ్యక్తంచేశారు. సోమవారం మండలంలోని ఆయా గ్రామాల రేషన్‌డీలర్లు తహసీల్దార్‌కు కమిషన్‌ను వెంటనే ఇప్పించాలని వినతిచేస్తూ వినతిపత్రం అందచేశారు. ఈసందర్భంగా రేషన్ డీలర్ల సంఘం మండల అధ్యక్షులు ఉప్పరి దేవదాస్ మాట్లాడుతూ గత 5నెలలుగా కమిషన్ అందక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ సూచనమేరకు ప్రజలకు రేషన్ బియ్యంను సక్రమంగా అందచేస్తున్నా తమకు రావాల్సిన కమిషన్ అందించకుంటే ఎలా అని ప్రశ్నించారు. మూడు నెలల కోటాను పక్షంరోజుల్లో అందించి ప్రజల అభిమానాన్ని అందుకున్నామని, కమిషన్‌ను వెంటనే విడుదల చేసి తమను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో రేషన్ డీలర్లు రాజు, విఠల్, శంకర్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దేవాలయాలు మానసిక ప్రశాంతకు నిలయాలు

**-ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే జిఎంఆర్**



దేవాలయ వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే జిఎంఆర్

**రామచంద్రాపురం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

దేవాలయాలు మానసిక ప్రశాంతతకు నిలయాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలివెల తండాలో కొలువుండి భక్తులచే నిత్యపూజలందుకుంటున్న సంత్ సేవాలాల్ మహారాజ్, భవాని మాత దేవాలయ వార్షికోత్సవాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయాల అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గుర్తుచేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ రాములు గౌడ్, మాజీ కౌన్సిలర్లు రామ్, పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, బాబ్జి, కొమరయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ఆలయ కమిటీబాధ్యులు, భక్తులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేసిన అధికారులు



ఝరాసంగంలో ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్ఐ

**ఝరాసంగం, ఆగస్టు 25, ప్రభాతవార్త:**

మండల కేంద్రమైన ఝరాసంగంలోని ఆయా ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయ అధికారి వెంకటేశం, టాస్క్ ఫోర్స్ టీం సబ్ ఇన్స్‌పెక్టర్ పాటిల్ క్రాంతికుమార్‌లు తనిఖీ చేశారు. దుకాణాల్లో యూరియా నిల్వలను పరిశీలించారు. ఊరియా ఈపాస్ మిషన్ ద్వారానే రైతులకు అందచేయాలని అధికారులు దుకాణం డీలర్‌కు సూచించారు. ఎరువుల నిల్వ, ధరల వివరాలను స్టాక్ బోర్డుపై రోజు వారీగా నమోదు చేయాలని ఆదేశించారు. అధిక ధరలకు ఎరువులను అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.